మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 22-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 323 Issue: 323

22 మే 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:46 సూర్యాస్తమయం - సా. 6:39 తిథి షష్ఠి ఉ. 6:25 వరకు తరువాత సప్తమి తె. 5:04ం వరకు సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం ఆశ్లేష రా. 2:07ం వరకు తరువాత మఖ యోగం వృద్ధి ఉ. 8:17 వరకు కరణం తైతుల ఉ. 6:25 వరకు గరజి సా. 5:45 వరకు వర్జ్యం మ. 3:15 నుండి సా. 4:48 వరకు దుర్ముహూర్తం ఉ. 8:20 నుండి ఉ. 9:12 వరకు మ. 12:38 నుండి మ. 1:30 వరకు రాహుకాలం ఉ. 10:36 నుండి మ. 12:12 వరకు యమగండం మ. 3:26 నుండి సా. 5:02 వరకు గుళికాకాలం ఉ. 7:22 నుండి ఉ. 8:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:10 నుండి తె. 4:58 వరకు అమృత ఘడియలు రా. 12:33 నుండి రా. 2:06 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial


## మ్యాన్‌కైండ్ కండోమ్స్ కాస్ట్లీ

### దేశంలో 30 శాతం మార్కెట్ ఈ కంపెనీదే




న్యూఢిల్లీ: ఫార్మా కంపెనీ మ్యాన్‌కైండ్ ఫార్మా త్వరలో కండోమ్ ధరలు పెంచనున్నట్టు తెలిపింది. పశ్చిమాసియాలో ఘర్షణలు, చమురు ధరల పెరుగుదల కొనసాగితే కండోమ్ ధరలను పెంచక తప్పదని కంపెనీ సీఈఓ షీతల్ అరోరా స్పష్టం చేశారు. దేశంలో సుమారు 30 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉన్న మ్యాన్‌ఫోర్స్ కండోమ్‌ల తయారీలో కెమికల్స్, లూబ్రికెంట్స్, ప్యాకేజింగ్ వంటి పెట్రోలియం ఆధారిత ముడి పదార్థాల వినియోగం ఎక్కువగా ఉండటంతో, చమురు ధరల పెరుగుదల నేరుగా తయారీ ఖర్చులను ప్రభావితం చేస్తోందని ఆయన చెప్పారు. ప్రస్తుతం కంపెనీ వద్ద కొన్ని తరువాయి 2 వ పేజీలో...

## మారుతి సుజుకి కార్లు పిరం




### మోడల్‌ను బట్టి 30 వేల దాకా పెంపు

### జూన్ నుంచి కొత్త ధరలు అమల్లోకి

ముంబై: దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా తమ వాహనాల ధరలను పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ కొత్త ధరలు జూన్ నుంచి అమల్లోకి రానున్నాయి. మోడల్‌ను బట్టి గరిష్ఠంగా రూ. 30,000 వరకు ధరలు పెరగనున్నాయని కంపెనీ తన స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో స్పష్టం చేసింది. ముడి సరుకుల తరువాయి 2 వ పేజీలో...



## వైభవోపేతంగా..!

### సరస్వతి అంత్య పుష్కరాలు ప్రారంభం

**తొలి స్నానం ఆచరించిన విజయేంద్ర సరస్వతి... పూజల్లో మంత్రులు దుద్దిళ్ల, కొండా సురేఖ**

తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో గోదావరి త్రివేణి సంగమం వద్ద సరస్వతి అంత్య పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం తెల్లవారుజామున 5.43 నిమిషాలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి పుష్కర స్నానం చేసి సరస్వతి అంత్యపుష్కరాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ పూజల్లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. సరస్వతి అంత్య పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

కాళేశ్వరం, మే 21 (ఈవార్తలు): కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద నేటి నుంచి జూన్ 1వ తేదీ వరకు సరస్వతి అంత్యపుష్కరాలు జరగనున్నాయి. ఈ పుష్కరాలు జరిగే 12 రోజులు పూజలు, హోమాలు... సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సరస్వతి అంత్యక్రియలు మే 21న మహా గణపతి హోమం నుంచి ప్రారంభం కాగా... జూన్ 1న లఘు చండి మహా పూర్ణాహుతితో ముగుస్తాయని పండితులు తెలిపారు. ఈ పుష్కరాల్లో భాగంగా ప్రతిరోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ నదిలో పుణ్య స్నానం ఆచరించనున్నారు. సరస్వతి అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టింది. సరస్వతి అంత్యపుష్కరాల ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.30.63 కోట్ల నిధులను కేటాయించింది. గత ఏడాది సరస్వతి ఆది పుష్కరాల సందర్భంగా జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. నడక దారిలో మ్యాట్లు, క్యూ లైన్లపై చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లను సైతం అందుబాటులో ఉంచారు. సరస్వతి అంత్యపుష్కరాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరంకు 3,360 బసులను ఏర్పాటు చేశారు. సరస్వతి అంత్యపుష్కరాలకు దాదాపు 30 నుంచి 40 లక్షల మంది ప్రజలు హాజరవుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇక, పవిత్ర సరస్వతి అంత్య పుష్కర మహోత్సవం సందర్భంగా భక్తులందరికీ సీఎం రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తులు కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమం వద్ద తరువాయి 2 వ పేజీలో...





## కేంద్ర కేబినెట్‌లోకి ఈటల, లక్ష్మణ్?

**రాష్ట్ర బీజేపీ ఎంపీలకు పదవులు?**

**మంత్రివర్గంలో ఓం బిర్లాకు చోటు!**

**మహిళకు స్పీకర్ పదవి ఇచ్చే చాన్స్**

త్వరలో కేంద్ర మంత్రి మండలి పునర్వ్యవస్థీకరణ జరుగుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి ఇద్దరికీ సహాయ మంత్రి పదవులు లభించే అవకాశం ఉంది సమాచారం. రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు మంత్రివర్గంలో చాన్స్ అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

న్యూఢిల్లీ: అలాగే, కిషన్ రెడ్డికి శాఖ మార్చే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం మంత్రి మండలిలో 30 మంది కేబినెట్ మంత్రులు, 36 మంది సహాయ మంత్రులు, ఐదుగురు స్వతంత్ర మంత్రులు ఉన్నారు. వీరిలో ఎవరిని తప్పిస్తారనే చర్చ నడుస్తోంది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం -2 వ పేజీలో...

## కార్మికుల కష్టానికి ఫలం

### వేతనాలు భారీగా పెంపు




**జూన్ 2 నుంచి అమల్లోకి.. 1.11 కోట్ల మందికి మేలు: రేవంత్**

కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. వారికి అందే కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ వేతనాల పెంపు జూన్ 2వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ నిర్ణయంతో తెలంగాణలోని 1.11 కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయాలను, విధివిధానాలను వివరించారు. ఇక రాష్ట్రంలోని కార్మికులను ప్రభుత్వం మూడు జోన్లుగా విభజించింది. కార్పొరేషన్ల పరిధిలో ఉండే కార్మికులను గ్రేడ్ 1గా.. మున్సిపాలిటీ పరిధిలో ఉండే కార్మికులను గ్రేడ్ 2గా.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కార్మికులను గ్రేడ్ 3గా పేర్కొంది. ఇక అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ అంటూ నాలుగు కేటగిరీలుగా కార్మికులను విభజించి వారికి కనీస వేతనాలను పెంచుతున్నట్లు చెప్పారు. జోన్ 1లో కనీస వేతనం ప్రస్తుతం రూ.12,750 ఉండగా.. దాన్ని రూ.16 వేలకు పెంచారు. ఇక స్కిల్డ్ కార్మికులకు రూ.13,772 గా ఉన్న జీతాలను రూ.18,500లకు పెంచారు. ఇక జోన్ 1లో సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.13,592 నుంచి రూ.17000 పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 'యువతకు నా విజ్ఞప్తి. సాంకేతిక నైపుణ్యం పెంచుకోండి. నైపుణ్యం ఉన్న వాళ్లను పంపాలని.. మన ప్రభుత్వాన్ని ఎన్నో దేశాలు సంప్రదిస్తున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కార్మికులకు కనీస వేతనం ఎక్కువగా ఉండాలి. కార్మికుల హక్కులను కాపాడటమే మా లక్ష్యం. కార్మికుల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. గడిచిన 15 ఏళ్లలో కార్మికులకు వేతన సవరణ చేయలేదు. గత ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసింది. మేము అధికారంలోకి వచ్చాక కార్మికుల కోసం సబ్ కమిటీ ఏర్పాటు చేశాం. గతంలో అర్బన్, రూరల్.. రెండే జోన్లు ఉండేవి. ఇప్పుడు మూడు జోన్లు చేశాం. నాలుగు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,704 |
| వెండి (కిలో): | రూ.3,00,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,075 |

## పుల్వామా మాస్టర్‌మైండ్ 'హంజా బుర్హాన్' హతం

**ముజఫరాబాద్‌లో చంపిన గుర్తుతెలియని వ్యక్తులు**

2019 నాటి ఘోరమైన పుల్వామా ఉగ్రదాడిలో కీలక నిందితుడైన ఉగ్రవాది హంజా బుర్హాన్ గుర్తుతెలియని దుండగుల చేతిలో హతయ్యాడు. 40 మందికి పైగా సీఆర్పీఎఫ్ జవాన్ల ప్రాణాలను బలిగొన్న ఈ దాడిలో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిని పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ముజఫరాబాద్‌లో దుండగులు కాల్చి చంపారు. ఇటీవలి కాలంలో పాకిస్తాన్, పీవోకేలలో ఆశ్రయం పొందుతున్న భారత వ్యతిరేక ఉగ్రవాదుల రహస్య హత్యలు చర్చనీయాంశంగా మారింది.



న్యూఢిల్లీ: బుర్హాన్ జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలోని ఖర్బత్‌పోరా ప్రాంతానికి చెందినవాడు. 2017లో, అతను ఉన్నత విద్యను అభ్యసించే నెపంతో పాకిస్థాన్‌లోకి ప్రవేశించినట్లు సమాచారం. అయితే, అతను నిషేధిత ఉగ్రవాద సంస్థ 'అల్-బదర్'లో చేరినట్లు నిఘా వర్గాల రికార్డులు తరువాత వెల్లడించాయి. ఉగ్రవాద కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ కాలక్రమేణా కమాండర్ స్థాయికి తరువాయి 2 వ పేజీలో...

## భగీరథ్ బెయిల్ పిటిషన్‌కు అనుమతి



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయి ప్రస్తుతం జైల్లో ఉన్న భగీరథ్, రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు గురువారం అనుమతి ఇచ్చింది. భగీరథ్ తరఫు న్యాయవాది కరుణా సాగర్, తమ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరారు.

హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): మే 16న భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఈ పిటిషన్‌పై విచారణ అవసరం లేదని పేర్కొన్నారు. ఆయన విజ్ఞప్తిని అంగీకరించిన న్యాయస్థానం, పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతించింది. అదే సమయంలో రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు కూడా వెసులుబాటు కల్పించింది. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలతో మే 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై తరువాయి 2 వ పేజీలో...



## ఇందుమూలంగా..!

**టీఆర్ఎస్‌పై అభ్యంతరాలున్నాయా?**

**ఈసీ బహిరంగ నోటీసు జారీ**

కల్వకుంట్ల కవిత సరికొత్త రాజకీయ పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆమె తన భర్త అనిల్‌కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి భారత ఎన్నికల సంఘం (ఈసీ) తాజాగా బహిరంగ ప్రకటన విడుదల చేసింది.

న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): ఈ కొత్త ప్రాంతీయ పార్టీకి అధ్యక్షురాలిగా కల్వకుంట్ల కవిత, జనరల్ సెక్రటరీగా దేవనపల్లి అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడిగా-2 వ పేజీలో...

## విశ్వవాణి



చెరుకుతో చక్కెర మాత్రమే ని తయారు చేస్తారని అనుకుంటాం. ప్రపంచంలోని చెరుకు ఉత్పత్తిలో సుమారు 81 శాతం చక్కెర తయారీకి ఉపయోగిస్తారు. మిగిలిన భాగం ఇంధనం, ప్లాస్టిక్, కాగితం వంటి అనేక పరిశ్రమలకు ఉపయోగపడుతుంది. బ్రెజిల్ దేశం కొన్ని దశాబ్దాల క్రితమే చెరుకు ఆధారిత ఎథనాల్ ఉత్పత్తిని ప్రారంభించింది. ప్రస్తుతం బయోఎథనాల్ తయారీలో చెరుకు ప్రధాన ముడి పదార్థంగా ఉంది. దీన్ని కాల్చి విద్యుత్తును కూడా ఉత్పత్తి చేయవచ్చు. పశువుల ఆహారం, కాగితం, కార్డుబోర్డులు, వస్త్రాలు, రమ్ తదితర ఉత్పత్తులను తయారు చేయవచ్చు.



## సింగరేణికి 'సోలార్' సిరులు

**మిగులు సోలార్ విద్యుత్‌కు విలువ తెచ్చిన సింగరేణి .. 4 నెలల్లోనే సత్ఫలితాలు.. బీఈఎస్ఎస్‌తో 26 లక్షల ఆదా**

హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): రాష్ట్రంలోనే తొలిసారిగా సింగరేణిలో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ సత్ఫలితాన్ని ఇస్తోంది. పగటిపూట ఉత్పత్తి జరిగే సోలార్ విద్యుత్తులో వినియోగించబడని విద్యుత్తును ఉచితంగా గ్రిడ్ కు సరఫరా చేయకుండా, బ్యాటరీలో నిలువ చేసుకొని, అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం కలిగించే ఈ వ్యవస్థ సింగరేణికి ఆర్థిక లబ్ధి చేకూర్చుతోంది. నాలుగు నెలల క్రితం మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సింగరేణి సోలార్ ప్లాంట్కు అనుబంధంగా 1 మెగావాట్ బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ నెలకొల్పారు. ఇందు కోసం తరువాయి 2 వ పేజీలో...

## అదిగో రాకాసి గాలులు!

### 3, 4 రోజుల్లో వడగాడ్పుల తీవ్రత



**తెలంగాణకు ఐఎండీ అలర్ట్.. రాబోయే 5 రోజులు నిప్పులే**

తెలంగాణ రాష్ట్రాన్ని భానుడి బెంబేలెత్తిస్తున్నాడు. ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు, వడగాడ్పుల తీవ్రత రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శాస్త్రవేత్త, వాతావరణ నిపుణుడు జీఎన్ఆర్ఎస్ శ్రీనివాసరావు హెచ్చరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయని ఆయన వెల్లడించారు.

న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మరో నాలుగు నుంచి 5 రోజుల పాటు ఇవే అధిక ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉంది. ఆ తర్వాత క్రమంగా వరంగల్, హన్మకొండ పరిసర ప్రాంతాలు, మహబూబాబాద్, నల్గొండ, సూర్యాపేటతో కూడిన మధ్య తెలంగాణ జిల్లాల్లో కూడా రాబోయే 3 నుంచి 4 రోజుల్లో వడగాడ్పుల తీవ్రత పెరగనుందని స్పష్టం చేశారు. కాగా, గత నాలుగు తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

22.5.2026

మేషం: దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయి. స్థిరాస్తి వివాదాలు తీరతాయి. ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కొత్త పనులకు శ్రీకారం చుడతారు. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

వృషభం: ఆర్థిక వ్యవహారాలు చికాకు పరుస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. మిత్రులతో దైవదర్శనాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు కలుగుతాయి. ముఖ్య వ్యవహారాలలో ప్రతిబంధకాలు ఉంటాయి. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. ఉద్యోగాలలో అధికారులతో చికాకులు పెరుగుతాయి.

మిథునం: ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. విలువైన వస్తు లాభాలు పొందుతారు. చాలా కాలంగా పడిన శ్రమ ఫలిస్తుంది. నూతన పనులు చేపడతారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగాలు ఆశాజనకంగా ఉంటాయి.

కర్కాటకం: చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు ఉంటాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి. ఉద్యోగ విషయమై అధికారులతో చర్చలు అనుకూలించవు.

సింహం: సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు ప్రారంభిస్తారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

కన్య: వివాదానికి సంబంధించి ప్రముఖుల నుంచి అందిన సమాచారం ఊరట కలిగిస్తుంది. ఆర్థికంగా మరింత మెరుగైన వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వృత్తి వ్యాపారాలలో నష్టాల నుండి బయటపడగలుగుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

తుల: ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. సన్నిహితులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. దూర ప్రయాణ సూచనలున్నవి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో ప్రతిష్ఠంభనలు కలుగుతాయి. వ్యాపారపరంగా కొంత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది.

వృశ్చికం: సోదరులతో కలహ సూచనలు ఉన్నవి. నూతన ఋణాలు చేస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహమున ఆకస్మికంగా నిర్ణయాలు మార్పులు చేస్తారు. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగాలలో ఊహించని స్థానచలన సూచనలు ఉన్నవి.

ధనస్సు: కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. మిత్రులతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో మీ అంచనాలు నిజమవుతాయి.

మకరం: చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఆకస్మిక ధనలాభాలు ఉన్నవి. భూవివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయాలు విస్తృతం అవుతాయి. వ్యాపార వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగాలలో సమస్యలు పరిష్కారం అవుతాయి.

కుంభం: నూతన ఋణయత్నాలు సాగిస్తారు. చేపట్టిన పనుల్లో ఆటంకాలు కలుగుతాయి. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వ్యాపారాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. మిత్రులతో కలహ సూచనలు ఉన్నవి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఊహించని ఇబ్బందులు ఎదురవుతాయి.

మీనం: వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ వాతావరణం చికాకుగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు మరింత బాధిస్తాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. కొన్ని పనులు వ్యయప్రయాసలతో కానీ పూర్తి కావు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి.




# సింగరేణికి 'సోలార్' సిరులు

మొదటి పేజీ తరువాయి

రూ.2.5 కోట్లను యాజమాన్యం వెచ్చించింది. ప్ర ప్రభుత్వం సౌర విద్యుత్తుకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని సింగరేణితో సహా పలు రాష్ట్ర సంస్థలు సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేస్తున్నాయి. సింగరేణి సంస్థ ఇప్పటికే 8 చోట్ల 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వీటిలో 147 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఓపెన్ యాక్సెస్ ప్లాంట్లుగా, మిగిలిన 98.50 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఇన్ హౌజ్ ప్లాంట్లుగా గుర్తించి తెలంగాణ విద్యుత్తు గ్రిడ్డులకు అనుసంధానం చేసింది. ఈ ఇన్ హౌజ్ ప్లాంట్ల విద్యుత్తును కూడా తెలంగాణ విద్యుత్ శాఖ గ్రిడ్లకు అనుసంధానం చేసినప్పటికీ విద్యుత్ ఒప్పందం ప్రకారం ఇక్కడ స్థానిక అవసరాలకు వాడగా మిగిలిన విద్యుత్తుకు మాత్రం తెలంగాణ డిస్కము ఎటువంటి చెల్లింపులు జరపదు. మిగులు విద్యుత్తును కేవలం ఉచితంగానే గ్రిడ్డుకు సరఫరా చేయాల్సి ఉంటుంది.

ఈ విధంగా ఇన్ హౌస్ ప్లాంట్ల నుండిరోజుకు వేలాది యూనిట్ల మిగులు విద్యుత్తును ఎటువంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా గ్రిడ్ కు సరఫరా చేయడం జరుగుతోంది. అయితే ఈ మిగులు విద్యుత్తును కూడా సొమ్ము చేసుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు సింగరేణి సంస్థ రాష్ట్రంలోనే తొలిసారిగా ఒక మెగావాట్ సామర్థ్యం గల బీఈఎస్ఎస్ ను మందమర్రి ప్లాంట్ లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసింది. మందమర్రి లో గల 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్ సమర్థంగా పనిచేస్తూ మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియా లలోని గనులకు, కాలనీలకు అవసరమైన విద్యుత్తును అందిస్తోంది. అయితే స్థానిక విద్యుత్తు అవసరాలకు సరిపోగా ఇంకా కొంత విద్యుత్తు మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలో మందమర్రి ప్లాంటు లో జనవరి నెలలో బ్యాటరీ ఎనర్జీ స్టోరీ సిస్టం ను సింగరేణి ఏర్పాటు చేసింది. అప్పటి నుండి ఇప్పటి వరకు బిఈఎస్ఎస్ యూనిట్ స్థానిక అవసరాలకు వినియోగించగా ఇంకా మిగిలిన 3,35,485 యూనిట్ల విద్యుత్తును నిల్వ చేసుకొని అవసరమైన సందర్భంలో వినియోగించుకుంది. తద్వారా సింగరేణి సంస్థకు రూ. 25,66,460 ఆర్థిక లబ్ధి చేకూరింది. ఒక మెగావాటు సామర్థ్యం గల బీఈఎస్ఎస్ యూనిట్ ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్తును ఆదా చేయడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇక్కడ ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన బీఈఎస్ఎస్ విజయవంతం అవడంపై సింగరేణి యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మరిన్ని ప్రాజెక్టులను చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు యాజమాన్యం ప్రకటించింది.



## భగీరథ్ బెయిల్ పిటిషన్‌కు
# అనుమతి

మొదటి పేజీ తరువాయి

పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం తర్వాత పోలీసులు పోక్సో చట్టంలోని కఠినమైన సెక్షన్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ కేసులో అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పించడానికి మే 15న హైకోర్టు నిరాకరించడంతో, మే 16న రాత్రి పోలీసులు భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. అయితే, తన కుమారుడు స్వయంగా లొంగిపోయాడని బండి సంజయ్ తెలిపారు. భగీరథ్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ప్రస్తుతం భగీరథ్ చెర్లపల్లి జైల్లో ఉన్నాడు.

## పుల్వామా మాస్టర్‌మైండ్ 'హంజా బుర్హాన్' హతం

మొదటి పేజీ తరువాయి

ఎదిగాడు. కాశ్మీర్‌లో భారత వ్యతిరేక కార్యకలాపాలకు ప్లాన్ చేయడం, స్థానిక యువతను ఉగ్రవాదం వైపు రిక్రూట్ చేయడంలో ఇతడు కీలక పాత్ర పోషించాడు. భారత కేంద్ర హోంశాఖ ఇతడి ఉగ్రవాద కార్యకలాపాలను పరిగణనలోకి తీసుకుని, 2022లో దేశ వ్యతిరేక చట్టాల కింద ఇతడిని అధికారికంగా 'ఉగ్రవాది'గా ప్రకటించింది. గత కొన్నేళ్లుగా పాకిస్తాన్‌లో తలదాచుకుంటున్న మోస్ట్ వాంటెడ్ భారత వ్యతిరేక ఉగ్రవాదులు వరుసగా గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమవుతున్నారు. ఇప్పుడు ఆ జాబితాలో పుల్వామా నిందితుడు హంజా బుర్హాన్ కూడా చేరాడు.




## మారుతి సుజుకి కార్లు పిరం

మొదటి పేజీ తరువాయి

ధరలు, నిర్వహణ వ్యయాలు నిరంతరం పెరుగుతుండటమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని మారుతీ సుజుకీ తెలిపింది. గత కొద్ది నెలలుగా ఖర్చులను తగ్గించుకునేందుకు అనేక చర్యలు తీసుకున్నామని, వ్యయ భారాన్ని వీలైనంత వరకు తామే భరించామని వివరించింది. అయితే, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితుల కారణంగా పెరిగిన ఖర్చుల్లో కొంత భాగాన్ని వినియోగదారులపై బదిలీ చేయక తప్పడం లేదని పేర్కొంది. తమ పోర్ట్‌ఫోలియోలోని అన్ని మోడళ్లపై ఈ పెంపు వర్తిస్తుందని, అయితే మోడల్‌ను బట్టి పెంపులో వ్యత్యాసం ఉంటుందని కంపెనీ తెలిపింది. వినియోగదారులపై వీలైనంత తక్కువ ప్రభావం చూపేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. ఇటీవలి కాలంలో ముడి సరుకులు, రవాణా ఖర్చులు పెరగడంతో పలు ఆటోమొబైల్ కంపెనీలు ఇప్పటికే తమ వాహనాల ధరలను పెంచాయి. ఏప్రిల్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా కూడా తమ ఎస్ యూవీలు, వాణిజ్య వాహనాల ధరలను 2.5 శాతం వరకు పెంచాయి.

## మ్యాన్‌కైండ్ కండోమ్స్ కాస్ట్‌లీ

మొదటి పేజీ తరువాయి

నెలలకు సరిపడా నిల్వలు ఉన్నప్పటికీ, పరిస్థితి కొనసాగితే పెరిగిన వ్యయాల్లో కొంత భాగాన్ని వినియోగదారులపై మోపాల్సి రావచ్చని అన్నారు. ఇదే సమయంలో, ప్రపంచంలో అతిపెద్ద కండోమ్ తయారీ సంస్థ కారెక్స్ కూడా ముడి పదార్థాలు, రవాణా ఖర్చుల కారణంగా ధరలను 20–30 శాతం వరకు పెంచాలని భావిస్తున్నట్టు తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో మ్యాన్ ఫోర్స్ 10 ప్యాక్ ధర సుమారు రూ.100–150 మధ్య ఉంది.



# అదిగో రాకాసి గాలులు!

మొదటి పేజీ తరువాయి

ఐదు రోజులుగా రాజధాని హైదరాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. గురువారం ఖమ్మం జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా.. గత వారం ఆదిలాబాద్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైందని ఆయన తెలిపారు. తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఒక ఊరటనిచ్చే వార్తను కూడా అందించింది. నైరుతి రుతుపవనాల కదలికలపై శాస్త్రవేత్త శ్రీనివాసరావు క్లారిటీ ఇచ్చారు. రుతుపవన గాలులు ఇప్పటికే బంగాళాఖాతంలోకి ప్రవేశించాయని, అండమాన్ నికోబార్ దీవులను పూర్తిగా కవర్ చేస్తూ మధ్య బంగాళాఖాతం వైపు దూసుకుపోతున్నాయని తెలిపారు. మే 25 నుంచి మే 28 మధ్య రుతుపవనాలు కేరళ ప్రధాన భూభాగాన్ని తాకే అవకాశం ఉందన్నారు. నైరుతి రుతు పవనాలు కేరళకు చేరుకున్న తర్వాత, రుతుపవనాలు తెలంగాణకు చేరుకోవడానికి సాధారణంగా మరో వారం రోజుల సమయం పడుతుంది. అంటే రుతుపవనాలు జూన్ మొదటి వారంలో తెలంగాణకు వచ్చే అవకాశం ఉంది.



## వైభవోపేతంగా..!

మొదటి పేజీ తరువాయి

పుణ్యస్నానాలు ఆచరించి, దైవానుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. ఈరోజు నుంచి జూన్ 1వ తేదీ వరకు జరగనున్న అంత్య పుష్కరాలకు సంబంధించి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేసిందని పేర్కొన్నారు. అంత్యపుష్కరాలకు తరలివచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుష్కరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా జరగాలని అభిలషించారు.

## కార్మికుల కష్టానికి ఫలం

మొదటి పేజీ తరువాయి

కేటగిరిలుగా కార్మికులను విభజించాం. కనీస వేతనాలు సవరించకపోవడం వల్ల కోటీ 11 లక్షల మంది కార్మికులు నష్టపోయారు' అని తెలిపారు.

వేతనాల పెంపు ఇలా..

- అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.12వేల నుంచి రూ.16వేలకు పెంపు
- హైస్కిల్డ్ కార్మికులకు రూ.14,600వేల నుంచి 20వేలకు పెంపు
- సెమీ స్కిల్డ్ కార్మికుల కనీస వేతనం రూ.13590 నుంచి రూ.15వేలకు పెంపు
- స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం రూ.17వేల నుంచి రూ.18వేలకు పెంపు

## ఇందుమూలంగా..!

మొదటి పేజీ తరువాయి

రూప్ సింగ్ లకావత్, కోశాధికారిగా డా.అరుణ్ కుమార్ నియమితులయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఈ బహిరంగ నోటీసును జారీ చేశారు. 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా, ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే వాటిని జూన్ 1 లోగా కేంద్ర ఎన్నికల సంఘానికి లిఖితపూర్వకంగా తెలియజేయాలని ప్రకటనలో స్పష్టం చేశారు. ఆ గడువు ముగిసిన తర్వాత ఈసీ పార్టీ రిజిస్ట్రేషన్‌పై తుది నిర్ణయం తీసుకోనుంది.

## కేంద్ర కేబినెట్‌లోకి ఈటల, లక్ష్మణ్?

మొదటి పేజీ తరువాయి

ఏర్పడి రెండేళ్ల అవుతున్న నేపథ్యంలో మంత్రివర్గాన్ని ప్రక్షాళన చేయనున్నట్టు వార్తలు బయటకు వచ్చాయి. కేబినెట్ సమావేశం తర్వాత కేంద్ర రాజకీయాల్లో కొత్త పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పని తీరు సరిగా లేని మంత్రులకు ఉద్వాసన పలికి.. కొత్త వారికి మంత్రివర్గంలో చోటు కల్పించే అవకాశం ఉంది. ఈ క్రమంలో బీజేపీలో ఆప్ రాజ్యసభ పక్షం విలీనంలో కీలకపాత్ర పోషించిన ఎంపీ రాఘవ్ చద్దాకు కేబినెట్ పదవి దక్కే అవకాశముంది. అలాగే, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మంత్రి మండలిలోకి తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓం బిర్లా స్థానంలో ఓ మహిళకు లోక్‌సభ స్పీకర్ ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం.

# ఎన్నాళ్లీ 'మొద్దు' నిద్ర

## రాష్ట్రంలో పంట కొనుగోళ్ల సంక్షోభం.. సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ





హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర ముఖ్యమంత్రి గారూ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి అని హితవు పలికారు. రైతుల ప్రాణాలు పోతున్నా.. పంటలు కొనరా..? కొనుగోలు కేంద్రాల్లో కుప్పకూలుతున్నా కనికరించరా అని మండిపడ్డారు. ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగమేంటని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదని అన్నారు. ఇవాళ బూతులు తిడుతున్న రైతులే.. రేపు వాతలు పెడతారని హెచ్చరించారు. కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు రైతు చేతిలోనే కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. ' తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లపాటు కొండంత ధైర్యంతో బతికిన అన్నదాత ఇవాళ ఆత్మవిశ్వాసం కోల్పోయి రోడ్డున పడ్డాడు. ఆరు దశాబ్దాల పాటు పడ్డ కష్టాలు శాశ్వతంగా తీరిపోయాయని సంబరంగా సాగుచేసుకుంటున్న రైతు నోట్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మట్టి కొట్టింది. రైతుకు రక్షణగా కేసీఆర్ గారు అమలుచేసిన ఒక్కో పథకానికి గత రెండేన్నరేళ్లుగా పాతరేసిన మీరు మీ చేతకానితనంతో అన్నదాత వెన్నువిరిచారు. ఇవాళ మీ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయి. అష్టకష్టాలు పడి పండించిన పంటను కొనే దిక్కులేక రెండునెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర్థనాదాలు చేస్తున్నారు. చేతకాని మీ సర్కారు నిర్వాకం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఏ మూలన చూసినా ఈరోజు రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. పంట అమ్ముకుందామనే ఆశతో వచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు పడలేక కొనుగోలు కేంద్రాల్లోనే గుండెపగిలి కుప్పకూలుతున్నా మీ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదు. 70 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో మీకున్న శ్రద్ధలో ఒక్క శాతం రైతులపై పెట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదు. మీ కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి మూటలు మోయడం తప్ప రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనాలన్న సోయి మాత్రం మీలో కనిపించడం లేదు. పెట్టుబడి సాయాన్ని వరుసగా నాలుగు సార్లు ఎగ్గొట్టినా, యూరియా కష్టాల పాలుజేసినా రైతులు అన్నింటినీ దిగమింగి పండించిన ఏ పంటను మీ ప్రభుత్వం కొనుగోలు చేసిన పాపాన పోలేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద దాదాపు పదిమంది రైతులు వడదెబ్బకు తోడు సర్కారు చేసిన ద్రోహానికి తమ నిండు ప్రాణాలు కోల్పోయారు. అయినా కనీసం ఒక్కసారైనా మీరు ఏ ఒక్క కొనుగోలు కేంద్రం వైపు కన్నెత్తి చూసిన దాఖలా లేదు. అందుకే రైతులు మరో మార్గం కనిపించక, ఇంతకాలం కంటిపాపలా పెంచుకున్న పంటను తమ చేతులతోనే తగలబెట్టుకుంటున్నారు. ఇవాళ తెలంగాణలోని రోడ్లపై కాలిబూడిదవుతున్న ధాన్యం కుప్పలు మీ అసమర్థతకు ప్రత్యక్ష సాక్ష్యాలు. గత రెండు నెలలుగా రాష్ట్రంలో నిరసనలో పాల్గొనని రైతు లేడు, రాస్తారోకో జరగని రహదారి లేదు. ఈ 30 నెలల్లోనే సమైక్యరాష్ట్రం నాటి సకల కష్టాల్లో మళ్లీ రైతులను ముంచెత్తారు. ఇన్నాళ్లు సంతోషంగా సాగిన సాగును కన్నీటి సేద్యంగా మార్చారు. కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న తెలంగాణ రైతుల కన్నీళ్లతో ఖాళీగా ఉన్న రిజర్వాయర్లు నిండేలా ఉన్నాయి. పగలూ రాత్రి ప్రజాసంపదను దోచుకోవడంపై తప్ప పరిపాలనపై మీకు కనీస పట్టులేకపోవడం అన్నదాతకు శాపంగా మారింది. విలువైన భూములను తెగనమ్మి వేలకోట్లు దోచుకోవాలన్న ఉత్సాహం తప్ప రైతుల పంటలను కొనాలన్న ధ్యాస మీలో ఏమాత్రం కనిపించడం లేదు. రోడ్లపై జరుగుతున్న నిరసనలనుంచి తప్పించుకునేందుకు, మీ మంత్రులు హెలికాప్టర్ లో షికార్లు కొడుతున్నారు. చివరికి మీ సొంత నియోజకవర్గం కొడంగల్ లో కూడా రైతులు రోడ్డెక్కి దుమ్మెత్తి పోసే దుస్థితి వచ్చిందంటే, సాగు ఎంతటి సంక్షోభాన్ని ఎదుర్కొంటుందో అర్థం చేసుకోవచ్చు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా అనేక జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కనీసం ఒక్కటంటే ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదు. ఇక అడపా దడపా చేసే కొనుగోళ్లలోనూ ఒక్కోచోట 10 కిలోలకు పైగా తరుగుతీస్తే ఇక రైతులకు మిగిలేదేంటో మీరే సమాధానం చెప్పాలి. చివరికి గన్నీ బ్యాగు కోసం రైతులే 50 రూపాయల చొప్పున డిపాజిట్ చేసే దుస్థితి తెచ్చినందుకు మీరు, మీ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బోనస్ ఇచ్చే ముఖం మీ సర్కారుకు ఎలాగూ లేదని ఇప్పటికే తేలిపోయింది. చివరికి పంట కొనుగోలు కూడా చేయడం చేతకాకపోతే రాష్ట్రంలోని 60 లక్షల మంది రైతులకు మీరు క్షమాపణలు చెప్పి ముక్కు నేలకు రాయండి. అన్నదాతలు అడుగడుగడునా పడిగాపులు పడుతుంటే వాటిని వదిలేసి, పర్యాటక వారోత్సవాలు నిర్వహించాలన్న మీ సర్కారుకు ప్రాధాన్యతలే కాదు, చివరికి పోయి కూడా లేదని తేలిపోయింది. 23న నిర్వహించే కేబినెట్ సమావేశంలోనైనా లెంపలేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టండి. వేలాది కొనుగోలు కేంద్రాల్లో గుట్టలుగా పేరుకుపోయిన ప్రతి పంటను కొని వెంటనే రైతుల కష్టానికి ప్రతిఫలాన్ని అందించండి. అలాగే మీరు చేసిన పాపాలకు ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద కన్నుమూసిన రైతుల కుటుంబాలకు 25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించండి. లేకపోతే మీరు చరిత్రలో ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలిపోతారు.' అని సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు.

## కుక్క కాటుతో బాలుడు మృతి

అలంపూర్, మే 21 (ఈవార్తలు): జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండల పరిధిలో ఓ బాలుడు కుక్కకాటుతో మృతి చెందాడు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. కోనేరు గ్రామానికి చెందిన బిచ్చాల స్వాములు, తిమ్మలమ్మకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. స్వాములు ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏప్రిల్ 25న కుమారుడు జీవన్‌బాబు (7), చిన్నకుమార్తె మణి ఇంటి పరిసరాల్లో ఆడుకుంటుండగా.. ఓ పిచ్చి కుక్క ఇద్దరిపై దాడి చేసింది. జీవన్ తలతో పాటు శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చిన్నారులిద్దరికీ వైద్యం చేయించారు. యాంటీ రేబిస్ వ్యాక్సిన్ సైతం ఇప్పించారు. అయితే ఈ నెల 16వ తేదీన బాలునికి జ్వరం రావడంతో స్థానికంగా ఉండే వైద్యుడి దగ్గరికి వెళ్లి చికిత్స చేయించారు. ఈనెల 18వ తేదీన జీవన్ ఆరోగ్యం క్షీణించడంతో పాటు కాలు, చెయ్యి కదలిక లేకపోవడం, పక్షవాతం మాదిరిగా రావడంతో వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బాలుడు గురువారం మృతి చెందాడు.

## అబద్ధం చెప్పింది రేవంతా? సంజయా?

**కొడుకుని తానే పోలీసులకు అప్పగించానన్న బండి**

**పోలీసులే అరెస్ట్ చేశారన్న సీఎం రేవంత్ రెడ్డి**

**ఇద్దరిలో ఎవరు చెప్పింది నిజం: ఆర్ఎస్పీ**

హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): పోక్సో కేసు నిందితుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ అరెస్ట్ వ్యవహారం ఒక పెద్ద రాజకీయ రచ్చకు దారితీసింది. ఈ అరెస్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అసలు జరిగింది పోలీసు అరెస్ట్ కాదా? లాయర్ల సమక్షంలో జరిగిన సరెండరా? ఏది నిజం? అని ప్రశ్నించారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి అబద్ధం చెబుతున్నారా.. లేక కేంద్ర మంత్రి బండి సంజయ్ అబద్ధం చెబుతున్నారా? అని ఆయన నిలదీశారు. అసలేం జరిగిందంటే... ఈరోజు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... "రోడ్డు మధ్యలో నాకాబందీ నిర్వహించి మరీ బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో రాజకీయం లేదు, పోలీసుల మాట నమ్మాలి" అని స్పష్టం చేశారు. దీనికి భిన్నంగా నిన్న బండి సంజయ్ స్పందించారు. "నేనొక బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రిగా, రాజకీయ నాయకుడిగా నా కొడుకును నేనే నా లాయర్ల ద్వారా పోలీసులకు సరెండర్ చేశాను" అని చాలా స్పష్టంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో "మనం రాష్ట్ర ముఖ్యమంత్రిని నమ్మాలా? లేక దేశ హోంశాఖ సహాయ మంత్రిని నమ్మాలా?" అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

## భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారు

**అప్పా జంక్షన్ తనిఖీల్లో అదుపులోకి**

**స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పోలీసులు చట్టప్రకారమే అరెస్ట్ చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అప్పా జంక్షన్ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. తనకు పోలీసులు ఇచ్చిన సమాచారం ఇదేనని.. వారి మాటలనే తాను నమ్ముతానని పేర్కొన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించారనే ప్రచారాన్ని ముఖ్యమంత్రి ఖండించారు. ఒకవేళ ఆయనే అప్పగించాలనుకుంటే పోలీసులను ఇంటికి పిలిచి అప్పగించాల్సిందని అభిప్రాయపడ్డారు. రోడ్డు మధ్యలో ఉన్న అప్పా జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకుంటే అది సరెండర్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. అప్పా జంక్షన్ ఏమైనా బండి సంజయ్ ఇల్లా? అని నిలదీశారు. ఫిర్యాదు అందిన వెంటనే ప్రభుత్వం పద్ధతి ప్రకారం చర్యలు తీసుకుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ సున్నితమైన కేసులో బీఆర్ఎస్ నాయకులు సిగ్గు తప్పి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వారే విచారణ జరిపి, వాళ్లే తీర్పులు ఇచ్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. పోక్సో కేసులో మైనర్ బాలిక వివరాలు వెల్లడిస్తే ఆ కుటుంబానికి ఎంతో ఇబ్బంది కలుగుతుందని, కేటీఆర్ రాజకీయాల కోసం ఒక బాలికను అడ్డుపెట్టుకోవడం సరికాదన్నారు.

# భగీరథ్‌తో ఆరెస్సెస్‌కు సంబంధం లేదు

**సంఘ్‌పై దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు**

**ఆరెస్సెస్ తెలంగాణ శాఖ తీవ్ర హెచ్చరికలు**




హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో పెను తుఫాను రేపుతున్న బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆరెస్సెస్ తెలంగాణ యూనిట్.. తాజాగా ఒక ప్రకటన రిలీజ్ చేసింది. బండి భగీరథ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు కావడం వల్ల.. ఇందులోకి ఆరెస్సెస్ శాఖను లాగుతున్నారని.. తెలంగాణ ప్రాంత సంఘచాలక్ బర్ల సుందర్ రెడ్డి.. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా బండి భగీరథ్ కేసు విషయంలో ఆర్ఎస్ఎస్□పై దుష్ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్□కి సంబంధించిన కుటుంబ వ్యవహారంలో ఆరెస్సెస్ సంఘ్ కార్యకర్తలను, సంఘాన్ని.. కొన్ని మీడియా సంస్థలు అనవసరంగా వివాదాల్లోకి లాగుతున్నాయని.. ఆరెస్సెస్‌ను అప్రతిష్ట పాలు చేయడానికి ప్రయత్నించడంపై బర్ల సుందర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రాంత కార్యవాహ కాచం రమేష్ జీ.. ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ జీల పేర్లు కొన్ని మీడియాల్లో రావడం.. కేంద్రమంత్రి బండి సంజయ్□తో వారికి ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని పేర్కొనడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వారిని రక్షించే ప్రయత్నాలు చేస్తున్నారంటూ.. అసత్య ప్రచారాలను రూపొందించి.. కొన్ని మీడియా సంస్థలు అవాస్తవ విషయాలను ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆరెస్సెస్ సంఘం తెలిపింది. సమాజంలో నిస్వార్థంగా, ప్రజా సేవలో నిరంతరం నిమగ్నం అయ్యే లబ్ధ ప్రతిష్ఠ కలిగిన కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని.. వారి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా కొన్ని మీడియా సంస్థలు ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి నిరాధారమైన వార్తలతో సంఘాన్ని.. సంఘ కార్యకర్తలను అప్రతిష్ఠ పాలు చేయాలని చూస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తీవ్రంగా హెచ్చరించింది. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అంతర్గత, సంస్థాగత వ్యవహారాలకు సంబంధించినంతవరకు.. తెలంగాణలో రాష్ట్ర బీజేపీ వ్యవహారాలను నేరుగా బీజేపీ కేంద్ర నాయకత్వం మాత్రమే పర్యవేక్షిస్తుందని తెలిపింది. ఇందులో ఆర్ఎస్ఎస్ తెలంగాణ యూనిట్□ ఎలాంటి ప్రత్యక్ష జోక్యం చేసుకోదని తేల్చి చెప్పింది. అయినప్పటికీ.. కొన్ని మీడియా సంస్థలు కనీస విచక్షణ లేకుండా.. బండి సంజయ్□కి సంఘ కార్యకర్తలకు ఆర్థిక వ్యవహారాలు ఉన్నాయంటూ.. అందుకే ఆయనను కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు కథనాలని ప్రచురిస్తూ.. ఆర్ఎస్ఎస్‌కు ఈ వ్యవహారాన్ని అంటగడుతూ సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూడటం చాలా దురదృష్టకరమని ఆరోపించింది. సమాజానికి వాస్తవ విషయాలను అందించాల్సింది పోయి మీడియా ద్వారా తప్పుడు వార్తలను ప్రసారం చేస్తున్నారని మండిపడింది. ఇక నుంచైనా ఇలాంటి తప్పుడు ప్రచారాలను ఆపేయాలని.. లేకపోతే అలాంటి వారు చట్టప్రకారం కఠిన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించింది.

# తెలంగాణకు రూ.5,681 కోట్లు

**మూడు ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి**

హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. తాజాగా తెలంగాణ రాష్ట్రానికి వరాల జల్లు కురిపించింది. 3 ప్రధాన ప్రాజెక్టుల కోసం భారీగా నిధులను విడుదల చేసేందుకు ఆమోదం కల్పించింది. ఇందులో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ సహా పలు నగరాల అభివృద్ధికి నిధులను కేటాయించింది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద.. రూ.5681 కోట్లను విడుదల చేసేందుకు పచ్చ జెండా ఊపింది. దీనికి సంబంధించి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తాజాగా ట్వీట్ చేశారు. కరీంనగర్ కోసం భారీ రూ.840 కోట్ల ప్యాకేజీతో సహా 3 ప్రధాన ప్రాజెక్టుల కోసం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద రూ.5,681 కోట్లకు అధికారికంగా తుది ఆమోదం తెలిపిందని తెలియజేయడానికి చాలా సంతోషిస్తున్నానని.. బండి సంజయ్ తన ట్వీట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ 3 మెగా ప్రాజెక్టుల్లో భాగంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు భారీ స్థాయిలో మౌలిక వసతులు, అభివృద్ధి జరుగుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. వరంగల్ మురుగునీటి పారుదల ఆధునీకరణ కోసం.. రూ. 4,674 కోట్లు.. కరీంనగర్ మోడల్ రోడ్లు, మౌలిక సదుపాయాల కోసం రూ.840 కోట్లు.. ఖమ్మం-వరంగల్-కరీంనగర్ కారిడార్ కోసం.. రూ.166 కోట్లకు ఆమోదం తెలిపినట్లు బండి సంజయ్ వెల్లడించారు. ఇక ఇందులో కరీంనగర్ జిల్లా అభివృద్ధికి సంబంధించిన పూర్తి వివరాలని వివరించారు. ఈ రూ.840 కోట్లలో మోడల్ రోడ్లు, స్కైవాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, జంక్షన్ అభివృద్ధి కోసం రూ.630 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక మరో రూ.130 కోట్లను వర్షపునీటి కాలువల పునరుద్ధరణ, వరద నివారణ కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. మిగిలిన రూ.80 కోట్లను.. సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ, డంప్ యార్డ్ పునరుద్ధరణ కోసం ఖర్చు పెట్టనున్నారు.

## బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వం

**- 119 నియోజకవర్గాలకు ఇంచార్జీలు**



హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వాన్ని ఈసారి డిజిటల్ విధానంలో నమోదు చేయాలని నిర్ణయించిన అధినేత కేసీఆం ఆ దిశగా దృష్టి సారించారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గాల్లో డిజిటల్ సభ్యత్వ నమోదుపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తుండగా.. కేసీఆర్ ఇంఛార్జిలను నియమించారు. డిజిటల్ సభ్యత్వ నమోదును వేగవంతంగా నిర్వహించేందుకు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఇంఛార్జిలకు బాధ్యతలు అప్పగించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## చక్రం తిప్పేది ప్రాంతీయ పార్టీలే

**న్యూజెర్సీ మీట్ అండ్ గ్రీట్‌లో హరీశ్ రావు**



న్యూజెర్సీ: ప్రాంతీయ పార్టీలే కేంద్రంలో చక్రం తిప్పుతున్నాయని.. ప్రాంతీయ పార్టీలే దేశ రాజకీయాల్లో కీలకమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. గురువారం అమెరికా న్యూజెర్సీలోని హల్దీ- మౌంట్ లారెల్‌లో మీట్ అండ్ గ్రీట్ విత్ హరీశ్‌రావు కార్యక్రమం గ్రాండ్‌గా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావుకు బీఆర్ఎస్ నాయకుడు కర్నాటి విద్యాసాగర్, ఎన్నారైలు మహేశ్ తన్నీరు, నరసింహారావు, భాస్కర్ పిన్న, రవీందర్ రావు ఘనస్వాగతం పలికారు. మీట్ అండ్ గ్రీట్‌లో తెలంగాణ సమకాలీన అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లోనూ ప్రాంతీయ పార్టీల పాత్ర రోజురోజుకూ పెరుగుతున్నదని, కేంద్రంలో కూడా ప్రాంతీయ పార్టీలే కీలకంగా మారాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని అన్నారు. రాష్ట్రం పంజాబ్‌ను మించి ధాన్యం ఉత్పత్తి చేసి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, సంక్షేమం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్లే తెలంగాణ వేగంగా అభివృద్ధి సాధించిందని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విజన్ లేని పాలన కారణంగా రాష్ట్రంలో అనిశ్చితి నెలకొందన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు మాత్రమే కాకుండా, కనీసం ఒక ప్లాట్ కొనుగోలు చేయాలన్నా ఎన్నారైలు భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో స్థిరత్వం, అభివృద్ధిపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోందన్నారు. తెలంగాణ సమకాలీన రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర భవిష్యత్ అంశాలపై ఎన్నారైలు ఆసక్తిగా చర్చించినట్లు హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రవాస తెలంగాణ వాసుల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కర్నాటి విద్యాసాగర్‌తో పాటు ఎన్నారైలు మహేష్ తన్నీరు, నరసింహా రావు, భాస్కర్ పిన్న, రవీందర్ రావు, అమర్ గుండ, పరమేశ్ బీం రెడ్డి, చైతన్య చిట్టిమల్ల, వరప్రసాద్, చందు తాళ్ల, పూర్ణ బైరి, నరసింహారెడ్డి, దొంతి రెడ్డి, రజినీ తదితరులు పాల్గొన్నారు.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE: Price for 5 Lines - Rs.450 (for each extra line - Rs.90)

COLOUR: Price for 5 Lines - Rs.500 (for each extra line - Rs.100)

Phone: +91 94404 55811 | Email: contact@evarthalu.com

# లోన్ రికవరీ పేరుతో వేధిస్తే కుదరదు

**ఆర్థిక సంస్థలకు ఆర్బీఐ కీలక ప్రతిపాదనలు**




న్యూఢిల్లీ: రుణాల రికరీకి సంబంధించి బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కఠిన నిబంధనలను ప్రతిపాదించింది. లోన్ల రికవరీ పేరుతో కస్టమర్లను వేధించే ఆర్థిక సంస్థలకు అడ్డుకట్ట వేసేందుకు కొత్త ప్రతిపాదనలతో ముందుకు వచ్చింది. ఈ మేరకు కండక్ట్ ఆఫ్ రెగ్యులేటెడ్ ఎంటీటీఎస్ ఇన్ రికవరీ ఆఫ్ లోన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ రికవరీ ఏజెంట్స్ పేరిట ముసాయిదా నిబంధనలను ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలపై మే 31వ తేదీ వరకు వాటాదారులు, ప్రజల అభిప్రాయాలను ఆర్బీఐ సేకరించనుంది. ఆ తర్వాత అక్టోబర్ 1వ తేదీ నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఆర్బీఐ ప్రతిపాదనల్లో కీలక అంశాలు ఉన్నాయి. వ్యక్తిగత, కారు, హోమ్ లోన్లకు సంబంధించి రుణగ్రహీత సకాలంలో తిరిగి చెల్లింపులు చేయనప్పుడు మొబైల్ ఫోన్‌ను లాక్ చేయడం, దాని ఫీచర్లను నిలిపివేయడం వంటివి బ్యాంకులు చేయకూడదని ప్రతిపాదనల్లో పేర్కొంది. ఒకవేళ ఆ మొబైల్ ఫోన్ లేదా టాబ్లెట్లను కొనుగోలు చేయడానికి సదరు ఆర్థిక సంస్థ లోన్ ఇచ్చి ఉంటే అప్పుడు మాత్రమే ఫోన్ ఫీచర్లను నిలిపివేసే హక్కు బ్యాంకుకు ఉంటుందని స్పష్టం చేసింది. అది కూడా లోన్ బకాయిపడి 90 రోజులు గడువు దాటి ఉండాలి. కస్టమర్లకు నోటీసులు ఇచ్చినా స్పందించకుంటే అప్పుడు చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. ఫోన్ బ్లాక్ చేసినప్పటికీ ఇంటర్నెట్, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర సేవలు, ప్రభుత్వ ఎమర్జెన్సీ అలర్టులు నిలిపివేయవద్దని పేర్కొంది. ఒకవేళ కస్టమర్ తన బకాయిని చెల్లిస్తే గంటలోనే ఫోన్‌పై ఉన్న ఆంక్షలు తొలగించాలి. ఆలస్యమైతే గంటకు రూ.250 చొప్పున బ్యాంకే తిరిగి రుణగ్రహీతకు పరిహారంగా చెల్లించాలని పేర్కొంది. లోన్ రికవరీ కోసం బ్యాంకు ఉద్యోగులు లేదా రికవరీ ఏజెంట్లు చేసే అన్ని కాల్స్ సమయం, నెంబర్లను రికార్డు చేయాలని ఆర్బీఐ ప్రతిపాదించింది. అలాగే వారు చేసే ఆడియో, టెక్ట్స్ సంభాషణలను భద్రపరచాలని బ్యాంకులకు సూచించింది. రుణాల వసూళ్ళలో లోన్ ఏజెంట్లు లేదా ఉద్యోగులు అసభ్యపదజాలం, బెదిరింపులకు దిగడం వంటివి చేయకూడదని పేర్కొంది. కస్టమర్ల వ్యక్తిగత వివరాలు, ఆడియో లేదా వీడియో రికార్డులను సోషల్ మీడియాలో పెట్టడం, సామాజిక మాధ్యమాల ద్వారా అసభ్య సందేశాలు పంపడం, కాల్స్ చేసి పదేపదే వేధించడం వంటివి చేయకూడదని ఆర్బీఐ ప్రతిపాదించింది.

# మదర్సాలలో వందేమాతరం తప్పనిసరి

**బెంగాల్ ప్రభుత్వం ఉత్తర్వులు**




కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ లోని బీజేపీ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. విద్యావ్యవస్థలో సరికొత్త మార్పులు తీసుకొస్తూ... రాష్ట్రంలోని అన్ని మదర్సాలలో 'వందేమాతరం' గీతాన్ని ఆలపించడం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మదర్సా విద్యా డైరెక్టరేట్ విడుదల చేసిన ఈ కొత్త నిబంధనల ప్రకారం.. ప్రభుత్వ, ప్రభుత్వ సహాయం పొందే, అలాగే గుర్తింపు పొందిన అన్ని రకాల మదర్సాలు, ఎంఎస్‌కే, ఎస్ఎస్‌కే సంస్థలలో రోజువారీ తరగతులు ప్రారంభమయ్యే ముందు నిర్వహించే ప్రార్థనా సమావేశాల్లో ఈ జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాల్సి ఉంటుంది. గతంలో అమలులో ఉన్న అన్ని పాత పద్ధతులను, ఉత్తర్వులను రద్దు చేస్తూ ఈ ఏకరీతి విధానాన్ని తక్షణమే అమలులోకి తీసుకువచ్చారు. రాష్ట్ర మైనారిటీ వ్యవహారాలు, మదర్సా విద్యాశాఖ మంత్రి ఖుదీరామ్ టుడు ఈ నిర్ణయాన్ని పూర్తిగా సమర్థించారు. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో సంతాలి భాషలో బోధన జరుగుతోందని, అక్కడ కూడా "వందేమాతరం" గీతాన్ని విజయవంతంగా ఆలపిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. కాబట్టి మదర్సాలలో దీనిని అమలు చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని, ఇది కేవలం జాతీయవాదం, విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించేందుకు ఉద్దేశించిన అంశమని స్పష్టం చేశారు. ఇటీవలే మే 13న రాష్ట్ర విద్యాశాఖ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'వందేమాతరం' తప్పనిసరి చేస్తూ నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ముఖ్యమంత్రి సువేందు అధికారి కూడా ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని తన అధికారిక సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో దేశ వ్యాప్తంగా దీనిపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇప్పుడు పాఠశాలలతో పాటు మదర్సాలలోనూ ఈ నిబంధనను తీసుకురావడం ద్వారా రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలలో ఒకే రకమైన ప్రార్థనా విధానాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

## ఢిల్లీకి వస్తే అరెస్టు చేస్తారేమో: అభిజీత్ దీప్కే

'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సంచలన వ్యాఖ్యలు చేశారు. "నేను అమెరికా నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో అడుగుపెట్టగానే, పోలీసులు నన్ను నేరుగా తిహార్ జైలుకు తీసుకెళతారనిపిస్తోంది" అని బోస్టన్ యూనివర్సిటీలో చదువుతున్న ఆయన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోల్చుతూ సీజేఐ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పుట్టిన ఈ వ్యంగ్య డిజిటల్ ఉద్యమం... కేవలం 5 రోజుల్లోనే 1.4 కోట్లకు పైగా ఇన్స్టాగ్రామ్ ఫాలోయర్లతో బీజేపీ, కాంగ్రెస్ అకౌంట్లను దాటేసింది. గూగుల్ ఫామ్ ద్వారా ప్రారంభమైన ఈ పార్టీలో మహువా మొయిత్రా, మనీష్ సిసోడియా వంటి ప్రతిపక్ష నేతలు కూడా చేరారు. అయితే, లీగల్ డిమాండ్ల కారణంగా ఈ పార్టీ అధికారిక ఎక్స్ ఖాతాను భారతదేశంలో నిలిపివేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీనిపై అభిజీత్ స్పందిస్తూ.. "ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారని నేనేమీ సంతోషంగా లేను. ఫాలోవర్లు పెరిగినంత మాత్రాన యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, పేపర్ లీకేజీలు వంటి అసలు సమస్యలు మారిపోవు కదా" అని విశ్లేషించారు. ఏది ఏమైనా కోట్ల ఫండింగ్ లేకుండా కేవలం మీమ్స్‌తో ఈ పార్టీ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను షేక్ చేస్తోంది.

## వికసిత్ భారతే లక్ష్యం

**కేంద్ర కేబినెట్‌లో చర్చ.. పశ్చిమాసియాపైనా డిస్కషన్**

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రిమండలి కీలక సమావేశం గురువారం సుమారు నాలుగున్నర గంటల పాటు కొనసాగింది. దేశ అభివృద్ధి, పరిపాలనా సంస్కరణలు, "వికసిత్ భారత్" లక్ష్యాల సాధనపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. సమావేశంలో కేంద్ర వాణిజ్య, ఆర్థిక శాఖలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా దేశ ఆర్థిక పరిస్థితి, పెట్టుబడులు, ఎగుమతులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలను వివరిస్తూ నివేదికలు సమర్పించాయి. ప్రభుత్వ పనితీరు మరింత వేగవంతం కావాలని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు మరియు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధాని మంత్రులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. కేబినెట్ మంత్రులు, స్వతంత్ర హోదా మంత్రులు, సహాయ మంత్రులు సమావేశానికి హాజరై తమ శాఖల పనితీరు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై వివరాలు అందించారు. సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతి, ప్రజలకు సేవల అందుబాటు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో పశ్చిమ ఆసియా సంక్షోభం, దాని ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందనే అంశంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. చమురు ధరలు, దిగుమతులు, వాణిజ్యంపై వచ్చే ప్రభావాలను అధికారులు మంత్రివర్గానికి వివరించినట్లు తెలుస్తోంది. ఇక వచ్చే జూన్ 9 నాటికి కేంద్రంలో మోడీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో, ఇప్పటివరకు అమలు చేసిన పథకాలు, భవిష్యత్ లక్ష్యాలపై కూడా సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

## ఐపీఓకు జెప్టో




బెంగళూరు/ముంబై: బెంగళూరుకు చెందిన క్విక్ కామర్స్ సంస్థ జెప్టో త్వరలో స్టాక్ మార్కెట్లలోకి ఎంట్రీ ఇవ్వనుంది. దాదాపు రూ. 11,000 కోట్ల నిధులను ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఈ ఐపీఓ విజయవంతమైతే, ఇప్పటికే స్టాక్ మార్కెట్లో లిస్టయిన జొమాటో, స్విగ్గీ సరసన జెప్టో కూడా చేరనుంది. ఇటీవల పబ్లిక్ ఆఫర్ కోసం సెబీ నుంచి అనుమతులు పొందింది. ఇప్పుడు అప్‌డేటెడ్ డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (యూడీఆర్‌హెచ్‌పీ)ను దాఖలు చేసినట్టు సమాచారం. జూలై 31లోపు మార్కెట్లో లిస్టింగ్ పూర్తి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. క్విక్ కామర్స్ రంగంలో జెప్టో వ్యూహం ఇతర కంపెనీలతో పోలిస్తే భిన్నంగా ఉందని బ్రోకరేజ్ సంస్థ బెర్న్‌స్టెయిన్ తెలిపింది. ప్రస్తుతం జెప్టో 61 నగరాల్లో 1,255 డార్క్ స్టోర్లను నిర్వహిస్తోంది. ఒక్కో నగరంలో సగటున 21 స్టోర్ల సాంద్రత ఉండగా, పోటీ సంస్థలు కేవలం తొమ్మిదే నిర్వహిస్తున్నాయి. ఆదిత్ పలిచా, కైవల్య వోహ్రా స్థాపించిన ఈ కంపెనీ, తొలినాళ్లలో కిరాణాకార్ట్‌గా కార్యకలాపాలు ప్రారంభించింది. 45 నిమిషాల్లో డెలివరీ సేవలు అందించే కంపెనీగా మొదలై, అనంతరం సొంతంగా డార్క్ స్టోర్లు ఏర్పాటు చేసుకుని 10 నిమిషాల్లో డెలివరీ సేవలను అందిస్తోంది. ఈ క్రమంలోనే కస్టమర్లకు ఫాస్ట్ డెలివరీల లక్ష్యంతో జెప్టోగా మారింది.

# కాక్రోచ్ పార్టీ దుమ్ముదుమారం!

## నెట్టింట్లో బొద్దింకల పార్టీ జోరు.. బీజేపీ, కాంగ్రెస్ సైతం వెనకే.. భారీ ఫాలోవర్లతో సరికొత్త రికార్డు!

న్యూఢిల్లీ: భారతీయ డిజిటల్ ప్రపంచంలో ఒక ఊహించని సంచలనం నమోదైంది. కేవలం వ్యంగ్యం, హాస్యం ప్రాతిపదికన ప్రారంభమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ.. దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల సోషల్ మీడియా సామ్రాజ్యాన్నే వణికించేస్తోంది. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే ఈ పేజీ ఏకంగా 12.7 మిలియన్ల పైగా ఫాలోవర్లను సంపాదించుకుని ఇంటర్నెట్ సెన్సేషన్‌గా మారింది. భారతీయ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్యను దాటేసిన సీజేపీ.. మరికొద్ది గంటల్లోనే కాంగ్రెస్ పార్టీని కూడా దాటేసి 16.3 మిలియన్ల ఫాలోవర్లను సొంతం చేసుకుంది. ఇది మరింత పెరుగుతోంది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో బీజేపీకి 8.7 మిలియన్ల ఫాలోవర్లు, ఆమ్ ఆద్మీ పార్టీకి 1.9 మిలియన్ల ఫాలోవర్లు ఉండగా.. కాంగ్రెస్ పార్టీకి 13.2 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. అయితే ఇప్పుడు కాంగ్రెస్‌ను కూడా కాక్రోచ్ జనతా పార్టీ దాటేసింది. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే 12.7 మిలియన్ల ఫాలోవర్లను సంపాదించుకున్న ఆ పార్టీ.. కొద్ది గంటల వ్యవధిలోనే కాంగ్రెస్ పార్టీని కూడా దాటేయడం ఆసక్తికరంగా మారింది.

**సీజేఐ కామెంట్స్ ఎఫెక్ట్**

ఈ 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆవిర్భావం వెనుక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. మే 15వ తేదీన జరిగిన ఒక కోర్టు విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ యువతను ఉద్దేశించి కొన్ని కామెంట్లు చేశారు. ముఖ్యంగా కొంతమంది నిరుద్యోగ యువకులు జర్నలిస్టులుగా, ఆర్‌టీఐ కార్యకర్తలుగా మారి అందరిపై దాడులు చేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. అయితే తన వ్యాఖ్యలను తప్పుగా మార్చారని సీజేఐ చెబుతుండగా.. నిరుద్యోగ యువత మాత్రం దీన్ని చాలా సీరియస్‌గా తీసుకుంది. ముఖ్యంగా ఢిల్లీకి చెందిన దీప్కే అనే యువకుడు తీవ్ర అసంతృప్తికి గురయ్యాడు. వ్యవస్థపై ఉన్న అసహనాన్ని వ్యంగ్యంగా చూపేందుకు ఈ 'కాక్రోచ్ జనతా పార్టీ'ని స్థాపించారు. "వ్యవస్థ లెక్కించడం మర్చిపోయిన ప్రజల ప్రతినిధులం" అని,




"బద్ధకస్తులు, నిరుద్యోగుల గొంతుక" అని ఈ వేదిక తమను తాము అభివర్ణించుకుంది. ఈ పేజీ ఇన్‌స్టాగ్రామ్ బయోలో "యువత యొక్క, యువత చేత, యువత కొరకు నడిచే రాజకీయ ఫ్రంట్" అని పేర్కొన్నప్పటికీ.. ఇది కేవలం పొలిటికల్ సెటైర్ మాత్రమేనని వారి వెబ్‌సైట్ స్పష్టం చేస్తోంది.

# ఉచిత నెట్‌ఫ్లిక్స్ అని రూ.లక్ష టోకరా



బెంగళూరు: ఉచితంగా లభించే వాటి పట్ల ఆకర్షణ ఒక్కోసారి భారీ మూల్యం చెల్లించేలా చేస్తుంది. బెంగళూరులో ఓ వ్యక్తికి సరిగ్గా ఇలాంటి అనుభవమే ఎదురైంది. ఉచితంగా నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వంటి ఓటీటీ సేవలు అందిస్తామన్న ఆశ చూపి, సైబర్ నేరగాళ్లు ఓ స్టోర్ మేనేజర్ నుంచి ఏకంగా రూ.1 లక్ష కాజేశారు. వివరాల్లోకి వెళితే.. రిచ్‌మండ్ టౌన్‌లో నివసించే 35 ఏళ్ల సయ్యద్ వసీం అహ్మద్, శివాజీనగర్‌లోని ఒక పెర్ఫ్యూమ్ షాపులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మే 18న అతను తన ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూస్తుండగా, 'ట్యూబీ' అనే మొబైల్ యాప్‌కు సంబంధించిన ప్రమోషనల్ లింక్ కనిపించింది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వంటి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను ఉచితంగా అందిస్తుందని ఆ ప్రకటనలో ఉండటంతో, వసీం ఆశపడి ఆ లింక్‌పై క్లిక్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఇన్‌స్టాల్ చేసిన కొద్ది నిమిషాల్లోనే అసలు మోసం బయటపడింది. సైబర్ నేరగాళ్లు అతని బ్యాంకు ఖాతా వివరాలను హ్యాక్ చేసి, పలు దఫాలుగా లావాదేవీలు జరిపి సుమారు రూ.1 లక్ష డ్రా చేసుకున్నారు. తన ఖాతా నుంచి డబ్బులు కట్ అవుతున్నట్లు సందేశాలు రావడంతో వసీం వెంటనే అప్రమత్తమయ్యాడు. తక్షణమే తన బ్యాంకును సంప్రదించి, ఖాతాలో మిగిలిన డబ్బును తన తండ్రి ఖాతాకు బదిలీ చేయించాడు. అనంతరం, అశోక్ నగర్ పోలీస్ స్టేషన్‌లో సైబర్ క్రైమ్ ఫిర్యాదు నమోదు చేశాడు. ఈ ఘటన నేపథ్యంలో సైబర్ నిపుణులు కీలక హెచ్చరికలు చేస్తున్నారు. ఉచిత లేదా తక్కువ ధరలకే ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లు ఇస్తామంటూ మోసగాళ్లు కొత్త పంథాలో వల పన్నుతున్నారని తెలిపారు. ఇలాంటి నకిలీ యాప్‌లు వినియోగదారుల వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలను దొంగిలించడానికే రూపొందించబడతాయని స్పష్టం చేశారు. ఏదైనా యాప్‌ను డౌన్‌లోడ్ చేసే ముందు దాని రివ్యూలు, రేటింగ్‌లను పరిశీలించాలని, అపరిచిత యాప్‌లకు వ్యక్తిగత సమాచారం, ఎస్ఎంఎస్, గ్యాలరీ వంటి వాటికి అనుమతులు ఇవ్వకూడదని సూచిస్తున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సమ్మె బాటలో ఎస్బీఐ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐ ఉద్యోగులు మే 25 నుంచి రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ స్టాఫ్ ఫెడరేషన్ (ఏఐఎస్‌బీఐ ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ సమ్మెకు ప్రధానంగా తగినంత సిబ్బంది నియామకంతో సహా పలు డిమాండ్లను నెరవేర్చకపోవడమేనని యూనియన్ పేర్కొంది. మెసెంజర్లు (సబార్డినేట్ స్టాఫ్), సెక్యూరిటీ స్టాఫ్ నియామకం, ఎన్‌పీఎస్ ఉద్యోగులకు పెన్షన్ ఫండ్ మేనేజర్ మార్చుకునే అవకాశం వంటి పలు డిమాండ్లను కూడా యాజమాన్యం ముందుంచింది. ఇక శాశ్వత ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్ చేయడాన్ని కూడా యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ విధానం వల్ల డేటా లీకులు, మోసాలు, ఐడెంటిటీ చోరీ ప్రమాదం పెరుగుతోందని, ఇది కస్టమర్ల నమ్మకాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని ఏఐఎస్‌బీఐఎస్‌ఎఫ్ ఆరోపించింది. సమ్మె తేదీలకు ముందు నాలుగో శనివారం, ఆదివారం సెలవులు కావడం, అనంతరం మే 27న బక్రీద్ సందర్భంగా అనేక రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు ఉండటంతో, మొత్తం ఐదు రోజుల పాటు ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు పనిచేయకపోవచ్చు. అయితే, ఈ సమస్యల పరిష్కారానికి మే 23న యూనియన్, యాజమాన్యంతో సమావేశం నిర్వహించనున్నారు. చర్చలు ఫలించకపోతే సమ్మెకు వెళ్తామని ఉద్యోగులు పేర్కొన్నారు.

# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

ముంబై: భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడితో పాటు పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలహీనపరిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 135.03 పాయింట్లు నష్టపోయి 75,183.36 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కేవలం 4.3 పాయింట్లు క్షీణించి 23,654.7 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధాన నష్టాల్లో నిలిచాయి. నిఫ్టీలో బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్ అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. అయితే, బ్రాడర్ మార్కెట్లో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.04 శాతం నష్టపోగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.63 శాతం లాభపడి మెరుగైన ప్రదర్శన కనబరిచింది. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు అత్యధికంగా క్షీణించాయి. మరోవైపు, రియల్టీ, సిమెంట్ రంగాలు మార్కెట్‌ను అధిగమించి రాణించాయి. ముఖ్యంగా నిఫ్టీ సిమెంట్ ఇండెక్స్ 2 శాతానికి పైగా లాభపడటం గమనార్హం. టెక్నికల్ అవుట్‌లుక్‌పై విశ్లేషకులు స్పందిస్తూ, నిఫ్టీకి 23,700, ఆ తర్వాత 23,800 వద్ద తక్షణ నిరోధం ఎదురవుతోందని తెలిపారు. ఈ స్థాయిల వద్ద అమ్మకాల ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. దిగువన, 23,500-23,600 స్థాయిలు కీలక మద్దతు జోన్‌గా కొనసాగుతాయని, దాని కింద 23,300 వద్ద బలమైన మద్దతు ఉందని నిపుణులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మార్కెట్ గమనాన్ని ఆర్బీఐ జూన్ పాలసీ నిర్ణయం, అమెరికా-ఇరాన్ చర్చల పురోగతి, కీలక వృద్ధి గణాంకాలు, రూపాయి స్థిరత్వం వంటి అంశాలు నిర్దేశిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రూపాయి విలువ 96.15 వద్దకు బలపడి కోలుకుంది.

# జీవవైవిధ్యమే జీవనాధారం

(నేడు అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం)

భూమి మీద ప్రతి ప్రాణీ, ప్రతి మొక్కా, ప్రతి సూక్ష్మజీవీ ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్న అద్భుతమైన వలయం ఈ ప్రకృతి. ఈ జీవవైవిధ్యమే మన మనుగడకు మూలాధారం. ప్రతి సంవత్సరం మే 22న 'అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం' జరుపుకోవడం ఆనవాయితీ. 2026 సంవత్సరానికి గాను "స్థానిక చర్యలతో.. ప్రపంచస్థాయి ప్రభావం" అనే ఇతివృత్తంతో ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. అయితే, కేవలం ఉత్సవాలకు, ఉపన్యాసాలకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రస్తుత పరిస్థితులతో బేరీజు వేసుకున్నప్పుడు మాత్రమే ఈ దినోత్సవానికి నిజమైన సార్థకత చేకూరుతుంది. ఒకవైపు మనం ప్రకృతి పరిరక్షణ గురించి గొప్పగా మాట్లాడుకుంటున్నాం, మరోవైపు అభివృద్ధి పేరిట విధ్వంసం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుత వాస్తవాలను గమనిస్తే ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సుమారు పది లక్షల (1 మిలియన్) వృక్ష, జంతు జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. పచ్చని అడవులు కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయి. గతేడాది ప్రపంచవ్యాప్తంగా 4.3 మిలియన్ హెక్టార్ల వర్షారణ్యాలు కనుమరుగయ్యాయి. ఇది వన్యప్రాణుల మనుగడకే కాదు, మానవాళి భవిష్యత్తుకు కూడా గొడ్డలిపెట్టు. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణాన్ని పట్టి పీడిస్తోంది. ఏటా 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ సముద్రాల్లోకి చేరుతూ జలచరాల ప్రాణాలను బలిగొంటోంది. రసాయన ఎరువుల వాడకం నేల సారాన్ని, నేలలోని సూక్ష్మ జీవులను నాశనం చేస్తోంది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బతిని, తరచుగా



- రామస్వామి చింత

అడవుల్లో కార్చిచ్చులు, వరదలు, కరువులు సంభవిస్తున్నాయి. 2030 నాటికి 'కున్మింగ్-మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్' నిర్దేశించిన 23 కీలక లక్ష్యాలను చేరుకోవడానికి కేవలం ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు చట్టాలు చేస్తే సరిపోదు. ఈ ఏడాది థీమ్ స్పష్టం చేస్తున్నట్లుగా, పౌరసమాజం స్థానికంగా నడుం బిగించాలి. మన చుట్టూ ఉన్న చెరువులు, నదులు, వృక్షజాలాన్ని కాపాడుకోవడం మన కనీస బాధ్యత. ప్రతి ఊరిలో చెట్లను పెంచడం ద్వారా స్థానిక ఉష్ణోగ్రతలను నియంత్రించవచ్చు. డిస్పోజబుల్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, స్థానికంగా పండే సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించడం, ఇంధనాన్ని పొదుపుగా వాడటం లాంటి చిన్నచిన్న మార్పులు పెద్ద ప్రభావాన్ని చూపుతాయి. పర్యావరణ పరిరక్షణలో స్థానిక కమ్యూనిటీలు, గిరిజన తెగల సంప్రదాయ పరిజ్ఞానాన్ని గౌరవించడం, వారిని భాగస్వాములను చేయడం అత్యవసరం. జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యం అన్నది కఠోర సత్యం. మనకు గాలి, నీరు, ఆహారం, మందులు అన్నీ ఈ ప్రకృతి నుంచే వస్తున్నాయి. జంతువులు, పక్షులు, కీటకాలు లేకుండా మనిషి ఒంటరిగా ఈ భూమి మీద బతకలేదు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం కేవలం ఒక్క రోజు వేడుకకు పరిమితం కాకూడదు. పర్యావరణ స్పృహ అనేది మన దైనందిన జీవితంలో ఒక భాగం కావాలి. మన స్థానిక ఆవాసాలను పరిరక్షించుకోవడమే, ప్రపంచ పర్యావరణాన్ని కాపాడే దిశగా మనం వేసే తొలి అడుగు.



## 15 రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

**అధికారులకు మంత్రి అడ్లూరి ఆదేశం**

జగిత్యాల బ్యూరో, మే 21 (ఈవార్తలు): రబీ సీజన్‌లో మిగిలిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రానున్న 15 రోజుల్లో 100 శాతం పూర్తి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల కలెక్టరేట్‌లో అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ సీజన్‌లో ఊహించని స్థాయిలో వరి, మొక్కజొన్న దిగుబడులు వచ్చాయని తెలిపారు. కేంద్ర నిబంధనల కారణంగా కొనుగోళ్లు ఆలస్యమైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం చర్యలతో గత 15 రోజులుగా కొనుగోళ్లు వేగం పుంజుకున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 2.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మరో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్నట్లు తెలిపారు. రైస్ మిల్లర్లు కొనుగోళ్లు పూర్తయ్యే వరకు ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి కోరారు. అధిక దిగుబడుల కారణంగా రవాణా, నిల్వ సమస్యలు ఉన్నప్పటికీ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గతేడాదితో పోలిస్తే కొనుగోళ్లు నాలుగు రెట్లు పెరిగాయని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో జగిత్యాల జిల్లా రాష్ట్రంలో ఆరవ స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో 2.49 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.



## ధాన్యం ఇంకెప్పుడు కొంటరు?

**కొనుగోళ్లలో జాప్యంపై బీజేపీ ఆగ్రహం**

**ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేత**

జగిత్యాల టౌన్, మే 21 (ఈవార్తలు): రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న జాప్యం, మౌలిక వసతుల కొరత, తరుగు--తేమ పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టి యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ జగిత్యాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ శాఖ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంట పండిస్తున్న రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందన్నారు. పండించిన పంటను విక్రయించుకునేందుకు రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ వారాల తరబడి తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం, ముందస్తు ప్రణాళిక లోపం కారణంగా అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే కాంటాలు, గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. తరుగు, తేమ, తాలు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసే దళారులు, కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి ధాన్యం గింజను వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆముదరాజు, ఇట్యాల రాము, గాదాసు రాజేందర్, ఠాగూర్ పవన్ సింగ్, కొప్పు భాస్కర్, మేడిపల్లి పుష్పారెడ్డి, పిండేరు భానుప్రియ, నారపాక అశోక్, కాసారాపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ధర్మపురిలో లాడ్జీలపై ఆకస్మిక తనిఖీలు

ధర్మపురి, మే 21 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి సూచనలతో ధర్మపురి సీఐ ఏ. రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై జి. మహేష్ పోలీసు సిబ్బందితో కలిసి పట్టణ పరిధిలోని లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, అద్దె గదుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సరైన గుర్తింపు పత్రాలు లేని వ్యక్తులకు గదులు అద్దెకు ఇవ్వవద్దని హెచ్చరించారు. ప్రతి లాడ్జిలో సీసీటీవీ కెమెరాలు పనిచేసేలా ఏర్పాటు చేయడంతో పాటు, వచ్చిన వారి పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జి. మహేష్ తెలిపారు.

## పాస్టర్ అభినయ్ దర్శన్‌కు 14 రోజుల రిమాండ్

అనకాపల్లి, మే 21 (ఈవార్తలు): మత విద్వేషాలు రెచ్చగొట్టడం, ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు పలు వివాదాస్పద కేసుల్లో నిందితుడిగా ఉన్న కడపకు చెందిన పాస్టర్, నటుడు అభినయ్ దర్శన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ మేరకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం కోర్టు న్యాయమూర్తి, అల్లూరి జిల్లా చింతపల్లి న్యాయస్థానం ఇన్‌ఛార్జి రోహిత్ గురువారం అధికారిక ఆదేశాలు జారీ చేశారు. సమాజంలో మతపరమైన ఉద్రిక్తతలను పెంచేలా వ్యవహరించిన ఆరోపణలపై అభినయ్ దర్శన్‌పై పలు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో గూడెంకొత్తవీధి పోలీసులు మంగళవారం రాత్రి ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

# లారీల్లేవ్.. ధాన్యం కొనరు!

**రైతులకు ఇదెక్కడి గోస?.. మాజీమంత్రి జీవన్ రెడ్డి మండిపాటు.. రాయికల్ మార్కెట్ సందర్శన**



రాయికల్, మే 21 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పరిశీలించారు. మార్కెట్‌లో భారీగా ధాన్యం నిల్వ ఉండటంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన అధికారులతో మాట్లాడారు. మార్కెట్‌లో ప్రస్తుతం సుమారు 40 వేల క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యం నిల్వ ఉండగా, అందులో ఇప్పటికే 20 వేల సంచులకు తూకం పూర్తయిందని అధికారులు తెలిపినట్లు సమాచారం. అయితే తూకం పూర్తయిన సంచుల రవాణా సక్రమంగా జరగకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ కలెక్టర్, మార్క్‌ఫెడ్ ఎండీ, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లో ఇప్పటికే 20 వేల సంచులకు తూకం పూర్తయినా, లారీలు అందుబాటులో లేకపోవడం వల్ల రవాణా ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. రోజుకు నాలుగు లారీలు మాత్రమే వస్తుండటంతో ధాన్యం తరలింపు మందగించిందని చెప్పారు. రైతులు పంటను మార్కెట్‌కు తీసుకువచ్చి రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. "మేము రైతుల సమస్యల కోసం రోడ్డెక్కితే రాజకీయాలు చేస్తున్నారంటారు. కానీ కళ్లాల వద్ద ధాన్యం అలాగే పేరుకుపోయి ఉంది. మాకు రాజకీయాలు కాదు, రైతుల సమస్యలకు పరిష్కారం కావాలి" అని అన్నారు. జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులు కనీసం ఫోన్ కూడా స్పందించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గోదాముల కేటాయింపు, లారీల కొరత సమస్య తీవ్రంగా ఉందని సంబంధిత అధికారులకు వివరించినట్లు తెలిపారు. జగిత్యాలలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ గోదాములు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించడం లేదని పేర్కొన్నారు. కొంతమంది కాంట్రాక్టర్లు గోదాములను తమ అవసరాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. గోదాములు ఎక్కడ అందుబాటులో ఉన్నా అక్కడి నుంచే ధాన్యం రవాణా చేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. సమస్య పరిష్కారానికి లారీల సంఖ్య పెంచడం, గోదాముల వినియోగాన్ని విస్తరించడం వంటి చర్యలు తీసుకుంటామని మార్క్‌ఫెడ్ అధికారులు హామీ ఇచ్చినట్లు జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, మున్సిపల్ చైర్మన్ రవి, యువజన నాయకుడు తాటిపర్తి సీకే రెడ్డి, ఇతర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో గుడుంబా దందా

**ఎక్సైజ్ శాఖ దాడులు.. కేసులు నమోదు**



జగిత్యాల, మే 21 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ గుడుంబా విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు ముమ్మర దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర రావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో గుడుంబా విక్రయాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతో ఓ ఇంటిపై దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల జిల్లాలో అక్రమంగా గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా గాంధీనగర్ ప్రాంతంలో కొంతకాలంగా గుడుంబా విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించి తనిఖీలు నిర్వహించారు. దాడుల సమయంలో అక్రమంగా నిల్వ ఉంచిన గుడుంబాను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సర్వేశ్వర రావు మాట్లాడుతూ గుడుంబా ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు, ఎవరు తయారు చేస్తున్నారు, ఎవరెవరు సరఫరా చేస్తున్నారు అనే అంశాలపై లోతుగా విచారణ చేపట్టినట్లు తెలిపారు. కేవలం విక్రయదారులపైనే కాకుండా తయారీదారులు, సరఫరాదారులు, వారికి సహకరిస్తూ గుడుంబా తయారీకి అవసరమైన బెల్లం పట్టికలు విక్రయిస్తున్న వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం వ్యాపారాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గుడుంబా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పేర్కొన్నారు. అనుమానాస్పదంగా గుడుంబా తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే ప్రజలు సమాచారాన్ని అందించాలని కోరారు. ఇప్పటివరకు బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన 15 మందిపై సుమారు రూ.5 లక్షల జరిమానా విధించినట్లు సీఐ వెల్లడించారు. జరిమానా చెల్లించని మరో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో అక్రమ గుడుంబా కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టి మరిన్ని దాడులు చేపడతామని హెచ్చరించారు.



## విద్యుత్ సేవలు ఇక అరచేతిలో

**టీజీఎన్‌పీడీసీఎల్ కొత్త యాప్**

**ఎస్ఈ సుదర్శనం వెల్లడి**

జగిత్యాల, మే 21 (ఈవార్తలు): వినియోగదారులకు మరింత చేరువయ్యేలా, సాంకేతిక సేవలను విస్తరించే దిశగా టీజీఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని జగిత్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. సుదర్శనం తెలిపారు. వినియోగదారుల సౌకర్యార్థం మొత్తం 28 ప్రత్యేక ఫీచర్లతో ఈ యాప్‌ను రూపొందించినట్లు గురువారం వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ యాప్ ద్వారా విద్యుత్ సంబంధిత అన్ని సేవలను ఒకే వేదికపై పొందే అవకాశం కల్పించామని తెలిపారు. వినియోగదారులు మీటర్ నంబర్‌తో తమ సమస్యలను నేరుగా యాప్‌లో నమోదు చేసుకోవచ్చని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కార స్థితిని కూడా యాప్ ద్వారానే తెలుసుకోవచ్చన్నారు. అలాగే సర్వీస్ నంబర్ నమోదు చేసి నెలవారీ విద్యుత్ బిల్లులను వేగంగా, సురక్షితంగా చెల్లించవచ్చని తెలిపారు. గతంలో చెల్లించిన బిల్లుల వివరాలు, విద్యుత్ వినియోగ సమాచారం కూడా అందుబాటులో ఉంటుందన్నారు. విద్యుత్ ప్రమాదాలు లేదా సమస్యలు గమనిస్తే ఫోటో, లొకేషన్‌తో యాప్ ద్వారా సమాచారం పంపే సదుపాయం కల్పించినట్లు చెప్పారు. కొత్త విద్యుత్ కనెక్షన్, మీటర్ పేరు మార్పు, లోడ్ పెంపు లేదా తగ్గింపు వంటి సేవలు కూడా యాప్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హెచ్‌టీఈ వినియోగదారులకు ప్రత్యేక సేవలు, ఆన్‌లైన్ చెల్లింపుల సౌకర్యం కల్పించామని చెప్పారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు సూచనలు, అధికారుల ఫోన్ నంబర్లు, టోల్‌ఫ్రీ సేవలు కూడా యాప్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు 1912 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సేవలను వినియోగించుకోవాలని ఎస్ఈ సుదర్శనం కోరారు.

## పిడుగురాళ్లలో 48.1 డిగ్రీలు

**నిప్పుల కొలిమిలా ఆంధ్రప్రదేశ్**

పిడుగురాళ్ల, మే 21 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో వేసవి తన ప్రతాపాన్ని తీవ్రస్థాయిలో చూపిస్తోంది. రాష్ట్రం అగ్నిగుండాన్ని తలపిస్తుండగా, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పిడుగురాళ్లలో నిన్న 47.6 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రత, ఇవాళ మరింత పెరిగి 48.1 డిగ్రీలకు చేరింది. రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. ఇక ఇతర ప్రాంతాల్లోనూ భానుడు భగభగమంటున్నాడు. బాపట్ల జిల్లా వేటపాలెం, కృష్ణా జిల్లా నందివాడలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎన్టీఆర్ జిల్లా టి.గుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీలు, ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నెల్లూరు జిల్లా కావలిలో 46.4 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నాడు 18 జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా, 20 జిల్లాల్లోని సుమారు 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.



## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

జగిత్యాల, మే 21 (ఈవార్తలు): జగిత్యాల నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. వివిధ కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు వైద్య ఖర్చుల నిమిత్తం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణకు దరఖాస్తు చేసుకోగా, ఆయన సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం మంజూరు చేయించారు. జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన పుల్ల రాజం, పోతారం గ్రామానికి చెందిన బద్ది రవి, సాధిరం రాజవ్వ--రాజనర్సు దంపతులకు మంజూరైన సుమారు రూ.50 వేల చెక్కులను ఎమ్మెల్సీ ఎల్. రమణ ఆదేశాల మేరకు జగిత్యాల ఎమ్మెల్సీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల వెలమ సంఘం అధ్యక్షుడు, ప్యాక్స్ చైర్మన్ అయిల్నేని సాగర్ రావు, పట్టణ కౌన్సిలర్లు కోరుకంటి రాము, తోట హరీష్, సర్పంచ్ గోలి గంగారెడ్డి, మాజీ ప్యాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ దయ్యాల మల్లారెడ్డి, వనమాల నిరంజన్, ఎడమల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చల్గల్ వాలంతరి క్షేత్రంలో ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల రూరల్, మే 21 (ఈవార్తలు): జగిత్యాల మండలం చల్గల్‌లోని వాలంతరి క్షేత్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వాలంతరీ డీజీ అనిత, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్తో కలిసి క్షేత్రంలో కొనసాగుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, నిర్వహణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో అమలవుతున్న పనుల పురోగతి, వాటి నిర్వహణ తీరుపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలు ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సత్య ప్రసాద్ సంబంధిత అధికారులతో వివిధ అంశాలపై చర్చించి, చేపడుతున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, ఎమ్మార్వో హకీమ్, ఏడీఏ కల్పన, ఏఈ ధనుంజయ్, ఆర్ఐ భూమయ్యతో పాటు నాయకులు నక్కల రవీందర్ రెడ్డి, బాల ముకుందం, ప్యాక్స్ చైర్మన్ సందీప్ రావు, ఏఎంసీ డైరెక్టర్ గడ్డం గంగారెడ్డి, అబ్బూరి మల్లేశం, నలువల సురేష్, పులిశెట్టి శ్రీనివాస్, దాసరి సతీష్, నరేశ్, కుసరి అనిల్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## 48 గంటల్లో దొంగను పట్టేశారు!

**చోరీ కేసు ఛేదించిన కోరుట్ల పోలీసులు**

**మైనర్ అరెస్టు.. నగదు, బైక్ స్వాధీనం**

కోరుట్ల, మే 21 (ఈవార్తలు): 48 గంటల్లో దొంగను పట్టేశారు కోరుట్ల పోలీసులు. కోరుట్ల సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కె. లక్ష్మీనారాయణ కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 17న మాదాపూర్‌కు చెందిన తమ్మిశెట్టి శ్రీను తన కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం ప్రకాశం జిల్లాకు వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నట్లు గుర్తించారు. బీరువాలో దాచిపెట్టిన రూ.4 లక్షల నగదు, రూ.20 వేల విలువైన సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తును స్వీకరించిన సీఐ కె. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై ఎం. చిరంజీవి, ఇద్దరు కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 48 గంటలపాటు నిర్విరామంగా శ్రమించి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో నిందితుడు గతంలో ఫిర్యాదుదారు తమ్మిశెట్టి శ్రీను వద్ద పనిచేసిన వ్యక్తిగా గుర్తించారు. తన స్నేహితుడు ఇటీవల బైక్ కొనుగోలు చేయడంతో తాను కూడా బైక్ కొనాలనే ఉద్దేశంతో జల్సాల కోసం ఈ దొంగతనానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. నిందితుడి నుంచి దొంగిలించిన సొమ్ముతో కొనుగోలు చేసిన రూ.1.65 లక్షల విలువైన యమహా ఎంటీ-15 బైక్, రూ.1.80 లక్షల నగదు, రూ.20 వేల విలువైన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని జువెనైల్ న్యాయ ప్రక్రియలో భాగంగా తరలించినట్లు తెలిపారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బంది పురుషోత్తం, గట్టు శ్రీనులను డీఎస్పీ రాములు నగదు బహుమతితో అభినందించారు. అలాగే సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవి సేవలను ప్రశంసించారు.

## నా వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నా: ప్రొఫెసర్ నాగేశ్వర్

హైదరాబాద్, మే 21 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌లను ఉద్దేశించి సోషల్ మీడియాలో తాను చేసిన వ్యాఖ్యలను ప్రొఫెసర్ నాగేశ్వర్ వెనక్కి తీసుకున్నారు. ఎన్డీయే కూటమిపై పెట్టిన పోస్ట్‌ను బేషరతుగా ఉపసంహరించుకున్నారు. దీనిపై జనసేన పార్టీ స్పందించింది. ప్రొఫెసర్ నాగేశ్వర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు పేర్కొంది. సీనియర్ విశ్లేషకుడిగా, మాజీ ఎమ్మెల్సీగా ఆయనకు ఉన్న అనుభవం, చేసే విశ్లేషణలపై తమకు గౌరవం ఉందని పేర్కొంది. కానీ, ఇటువంటి తప్పుడు వార్తలు మీ దృష్టికి వస్తే దయచేసి తమ పార్టీ కార్యాలయాన్ని సంప్రదిస్తే సరైన సమాచారం ఇస్తామని జనసేన వ్యాఖ్యానించింది. భవిష్యత్తులో ఊహాజనిత, నిరాధార కథనాలను ప్రస్తావించరని ఆశిస్తున్నామని పేర్కొంది.

వయ్యారి చిత్రం



ప్రియా బెనర్జీ




## చిరు 'మెగా 158'కి పవన్ క్లాప్

ఒకే ఫ్రేమ్‌లో మెగాస్టార్ చిరంజీవి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మెగా బ్రదర్ నాగబాబు నవ్వుతూ ముచ్చటిస్తూ కనిపించిన అపురూప దృశ్యం ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తోంది. దీనికి చిరంజీవి కొత్త సినిమా పూజాకార్యక్రమం వేదికైంది. ముగ్గురు అన్నదమ్ములు ఇలా ఒకే చోట కలవడంతో మెగా అభిమానులు పండగ చేసుకుంటున్నారు. మాస్ డైరెక్టర్ బాబీ దర్శకత్వంలో 'మెగా 158' సినిమా పూజా కార్యక్రమాలతో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. 'వాల్తేరు వీరయ్య' వంటి హిట్ తర్వాత వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, ప్రియమణి, అనస్వర రాజన్, అనురాగ్ కశ్యప్, బండ్ల గణేశ్ లాంటి తారాగణం నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ మూవీ ముహూర్తపు షాట్‌కు పవన్ కల్యాణ్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. మెగా బ్రదర్స్ ముగ్గురూ కలిసి ముచ్చటించిన హ్యాపీ మూమెంట్స్ నెట్టింట ట్రెండింగ్‌గా మారాయి. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ థమన్ స్వరాలు అందిస్తున్నారు.


## ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు షాక్

సంగీత మాంత్రికుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన కంపోజ్ చేసిన క్లాసిక్ హిట్ సాంగ్ 'ఎన్ ఇనియ పొన్ నిలవే' కాపీరైట్ వివాదంలో ధర్మాసనం కీలక తీర్పును వెలువరించింది. ఈ పాటపై మ్యూజిక్ లేబుల్ 'ఇకో రికార్డింగ్స్' సంస్థకు ఉన్న హక్కులను కోర్టు సమర్థించింది. అయితే, 1980ల నాటి బ్లాక్‌బస్టర్ తమిళ చిత్రం 'మూడు పాని'లోని 'ఎన్ ఇనియ పొన్ నిలవే' పాట కాపీరైట్ హక్కులకు సంబంధించి ఇళయరాజా, ఇకో రికార్డింగ్స్ సంస్థల మధ్య చాలాకాలంగా పంచాయతీ నడుస్తోంది. తన పర్మీషన్ లేకుండా ఆ పాటను వాడటంపై ఇళయరాజా గతంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసును గతంలో విచారించిన సింగిల్ జడ్జి బెంచ్, సదరు మ్యూజిక్ లేబుల్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దానిని ఇళయరాజా సవాలు చేస్తూ తాజాగా ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ యశ్వంత్ వర్మ, జస్టిస్ రవీందర్ దుడేజాలతో కూడిన ధర్మాసనం సింగిల్ జడ్జి ఇచ్చిన పాత తీర్పునే సమర్థించింది. నిర్మాతల నుండి చట్టబద్ధమైన ఒప్పందాల ద్వారా ఆడియో హక్కులను పొందినందున, ఆ పాటల వాణిజ్యపరమైన వినియోగంపై ఇకో రికార్డింగ్స్ సంస్థకే సర్వహక్కులు ఉంటాయని కోర్టు స్పష్టం చేసింది. మ్యూజిక్ డైరెక్టర్‌గా ఇళయరాజాకు ఉన్న హక్కులు, సదరు మ్యూజిక్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పంద పరిమితులకు లోబడే ఉంటాయని కోర్టు కోర్టు తెలిపింది.



## మా బిడ్డను కూడా ఎత్తుకోలేకపోయా: రామ్ చరణ్

ప్రస్తుతం పెద్ది మూవీ ప్రమోషన్లతో రామ్‌చరణ్ బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బుచ్చిబాబుతో తన అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యంగా రెజ్లర్లతో సీన్ల గురించి వివరించారు. ఇసుకలో, ఎండలో షూటింగ్ చాలా కష్టంగా అనిపించలేదా అని బుచ్చిబాబ.. చెర్రీని ప్రశ్నించారు. దీనికి రామ్ చరణ్ బదులిస్తూ నేనైతే చాలా బాగా ఎంజాయ్ చేశానని అన్నారు. కష్టమైన పనిని ఇష్టంగా చేస్తే ఎలాంటి అలసట రాదన్నారు. అయితే కుస్తీలో చేయి పట్టి అదురు రావడంతో మా పాపను కూడా ఎత్తుకోలేకపోయానని తెలిపారు. మీరు నిజమైన పహిల్వాన్లను పెట్టారని రామ్ చరణ్ అన్నారు. వాళ్లు నటించాలంటే.. రియల్‌గా ఆడేస్తున్నారని రామ్ చరణ్ గుర్తు చేశారు. తర్వాత మళ్లీ సారీ చెబుతున్నారని తెలిపారు. ఎందుకంటే వాళ్లలో నిజమైన స్పోర్ట్స్ మ్యాన్ స్పిరిట్ అనేది వాళ్లలో ఉంటుందని చెర్రీ వివరించారు. యాక్టింగ్ చేయమంటే వారికి అది రాదని అన్నారు.



## చరణ్ ఐయామ్ వెయిటింగ్



రామ్ చరణ్ హీరోగా రూపొందుతున్న 'పెద్ది' చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను మే 18వ తేదీన ముంబై వేదికగా విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ మూవీ ట్రైలర్‌ను తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేశారు. విడుదలైనప్పటి నుంచి ఈ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా 'పెద్ది' ట్రైలర్‌పై సోషల్ మీడియా వేదికగా స్పందించింది. "ఓవరాల్‌గా 'పెద్ది' ట్రైలర్ ఫైర్. రామ్ చరణ్, జాన్వీ కపూర్, దివ్యేందు శర్మ, దర్శకుడు బుచ్చిబాబు సనా అలాగే మొత్తం టీమ్‌కు అభినందనలు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అంటూ ఓ పోస్ట్ చేసింది. ప్రస్తుతం ప్రియాంక చోప్రా చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది. చాలా సంవత్సరాల క్రితం రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'జంజీర్' చిత్రంలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటించింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, వీరిద్దరి జంటకు మంచి ప్రశంసలు దక్కాయి. ఇక 'పెద్ది' సినిమా ప్రపంచవ్యాప్తంగా జూన్ 4వ తేదీన విడుదల కానుండగా ఈ చిత్రంపై ఇప్పటికే భారీ స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి.

## నేటి నుంచి ఓటీటీల్లో 'ధురంధర్1' అన్‌కట్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్, సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య ధర్ కాంబినేషన్‌లో వచ్చి బాక్సాఫీస్ వద్ద రూ. 1800 కోట్లకు పైగా వసూళ్లతో సరికొత్త చరిత్ర సృష్టించిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' ఓటీటీ వేదికగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఓవర్సీస్‌లో డిజిటల్ రిలీజై భారీ వ్యూస్‌తో దూసుకుపోతున్న ఈ క్రేజీ మూవీ సెకండ్ పార్ట్ భారతీయ ప్రేక్షకులకు త్వరలోనే అందుబాటులోకి రానుంది. జూన్ 4వ తేదీ రాత్రి 7 గంటల నుంచి 'జియో హాట్‌స్టార్' వేదికగా 'ధురంధర్ 2' స్ట్రీమింగ్ కానున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే ఈ నేపథ్యంలోనే భారతీయ ప్రేక్షకులకు మరో సర్ప్రైజ్‌ను ఇచ్చింది చిత్రబృందం. ఈ సినిమా మొదటి భాగానికి సంబంధించిన అన్‌కట్ వెర్షన్‌ను డిజిటల్ వేదికలపైకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించింది. మే 22 నుంచి నెట్‌ఫ్లిక్స్, జియో హాట్‌స్టార్ రెండింటిలోనూ ఒకే రోజున ఈ అన్‌కట్ వెర్షన్ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపింది.






## బాహుబలి బడ్జెట్ ఫెయిల్యూర్ ప్లాన్ అనుకున్నా: తమన్నా

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా తెలుగు, హిందీ, తమిళ సినిమాలతో పాటు ఐటమ్ సాంగ్స్ కూడా చేస్తూ ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతుంది. ఇక ఆమె కెరీర్‌లోనే మైల్‌స్టోన్‌గా నిలిచిన చిత్రం 'బాహుబలి'. దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ఈ విజువల్ వండర్ ఇండియన్ సినిమా రికార్డులను తిరగరాసింది. అయితే, ఈ చిత్రం విడుదలై ఇన్నేళ్లు గడుస్తున్నా, ఇప్పటికీ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఏదో ఒక ఆసక్తికర విషయం నెట్టింట హల్‌చల్ చేస్తూనే ఉంటుంది. తాజాగా తమన్నా 'బాహుబలి' బడ్జెట్, ఆ సినిమా నిర్మాణ సమయంలో ఉన్న పరిస్థితుల గురించి చేసిన కొన్ని కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "ఈరోజు వెనక్కి తిరిగి చూసుకుంటే 'బాహుబలి' కోసం తీసుకున్న ప్రతీ నిర్ణయం ఎంతో అద్భుతమైనదిగా, మంచి నిర్ణయంగానే కనిపిస్తుంది. కానీ, ఆ సినిమా తీస్తున్న సమయంలో ట్రేడ్ లెక్కలు, పరిస్థితులు వేరుగా ఉండేవి. కేవలం ఒక ప్రాంతీయ తెలుగు చిత్రం కోసం అప్పట్లోనే సుమారు రూ. 200 కోట్ల బడ్జెట్ పెట్టడం అంటే మామూలు విషయం కాదు. వ్యాపార వ్యూహాత్మకంగా ఆలోచిస్తే.. ఆ బడ్జెట్ నేరుగా ఫ్లాప్‌కు దారితీసే ఒక ప్రమాదకరమైన మార్గంలా కనిపించింది" అని తమన్నా చెప్పుకొచ్చింది. అయితే సృజనాత్మక వ్యాపారాలు సాధారణ బిజినెస్ సూత్రాలలా పనిచేయవని తమన్నా అభిప్రాయపడింది. "మిగతా ప్రపంచంతో ఇతరులు అది తప్పో అస్సలు సంబంధం లేదు. ఒక వ్యక్తి తన విజన్‌ను గట్టిగా నమ్మితే చాలు, ఎలాంటి అద్భుతాలనైనా సృష్టించవచ్చు.





# సీఎస్కే ఇంటికే!

**గుజరాత్ భారీ విజయం.. గిల్, సుదర్శన్, బట్లర్ మెరుపులు.. సిరాజ్, రబాడ, రషీద్ నిప్పులు.. ఛేదనలో తడబడ్డ చెన్నై**

**ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ప్రస్థానం ముగిసింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో 89 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలై ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది.**

**అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ విజయంతో గుజరాత్ ప్లే ఆఫ్స్‌లో టాప్-2 స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకుంది.**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (37 బంతుల్లో 64), సాయి సుదర్శన్ (53 బంతుల్లో 84) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత వచ్చిన జాస్ బట్లర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 27 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. 230 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ ఆది నుంచే తడబడింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సంజూ శాంసన్ డకౌట్ అయ్యాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (16) మెరుపులు తాత్కాలికమే అయ్యాయి. మహమ్మద్ సిరాజ్ తన తొలి ఓవర్లలోనే కీలక వికెట్లు పడగొట్టి చెన్నైని కోలుకోలేని దెబ్బ తీశాడు. శివమ్



దూబే (17 బంతుల్లో 47) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో చెన్నై 13.4 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. గుజరాత్ బౌలర్లలో మహమ్మద్ సిరాజ్, కగిసో రబాడ, రషీద్ ఖాన్ తలా మూడు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 13 | 9 | 4 | 18 |
| గుజరాత్ | 14 | 9 | 5 | 18 |
| హైదరాబాద్ | 13 | 8 | 5 | 16 |
| రాజస్థాన్ | 13 | 7 | 6 | 14 |
| పంజాబ్ | 13 | 6 | 6 | 13 |
| కోల్‌కతా | 13 | 6 | 6 | 13 |
| చెన్నై | 14 | 6 | 8 | 12 |
| ఢిల్లీ | 13 | 6 | 7 | 12 |
| ముంబై | 13 | 4 | 9 | 8 |
| లక్నో | 13 | 4 | 9 | 8 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు



## హార్దిక్ ఫీజులో కోత: బీసీసీఐ

ఐపీఎల్ 2026 సీజన్లో కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో ఓటమి పాలైన ముంబై ఇండియన్స్ జట్టుకు మరో గట్టి షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు గానూ భారత క్రికెట్ నియంత్రణ మండలి అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా హార్దిక్ పాండ్యా మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతో పాటు, అతనికి ఒక డెమెరిట్ పాయింట్‌ను కేటాయించారు. వివరాల్లోకి వెళితే.. ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ రెండో ఇన్నింగ్స్ 10వ ఓవర్ నాలుగో బంతి సమయంలో.. హార్దిక్ పాండ్యా తన రన్-అప్కు వెనుకకు నడుచుకుంటూ వెళ్తూ, తీవ్ర అసహనంతో వికెట్లపై ఉన్న బెయిల్స్‌ను గట్టిగా కిందకు కొట్టాడు. ఈ ప్రవర్తన ఐపీఎల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ లోని లెవెల్-1 పరిధిలోకి వచ్చే ఆర్టికల్ 2.2 ప్రకారం నిబంధనల ఉల్లంఘనగా తేలింది. ఈ ఆర్టికల్ ప్రకారం మ్యాచ్ జరుగుతున్న సమయంలో క్రికెట్ కిట్, దుస్తులు, మైదానంలోని పరికరాలు లేదా వికెట్లు వంటి వాటిని దుర్వినియోగం చేయడం లేదా వాటిపై అసహనం ప్రదర్శించడం నిషేధం. మ్యాచ్ అనంతరం ఈ ఉల్లంఘనకు సంబంధించి మ్యాచ్ రిఫరీ రాజీవ్ సేథ్ విధించిన ఈ జరిమానా,శిక్షకు హార్దిక్ పాండ్యా అంగీకరించాడు.

## అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ

దేశవాళీ క్రికెట్ షెడ్యూల్ రిలీజ్భారత దేశవాళీ క్రికెట్ సీజన్ 2026-27కు సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం ప్రకటించింది. ఈ సీజన్ దులీప్ ట్రోఫీతో మొదలుకానుంది. ఈ టోర్నీ బెంగళూరు వేదికగా ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 10 వరకు జరుగుతుంది. ఆ తర్వాత అక్టోబర్ 1 నుంచి 5 వరకు శ్రీనగర్ ఇరాన్ కప్‌కు ఆతిథ్యమిస్తుంది. అనంతరం దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నీ రంజీ ట్రోఫీ జరుగుతుంది. అక్టోబర్ 11 నుంచి రంజీ ప్రారంభమవుతుంది. రెండు దశల్లో జరిగే ఈ టోర్నీలో ముందుగా ఎలైట్ గ్రూపు మ్యాచ్‌లు అక్టోబర్ 11 నుంచి 5 వరకు జరుగుతాయి. వచ్చే ఏడాది జనవరి 17 నుంచి మార్చి 3 వరకు రెండో దశ మ్యాచ్‌లు జరుగుతాయి. కల్నల్ సీకే నాయుడు(అండర్-23) టోర్నీ కూడా అక్టోబర్ 12 నుంచి మార్చి 1 వరకు రెండు దశల్లో షెడ్యూల్ చేశారు. సీనియర్ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ నవంబర్ 14 నుంచి డిసెంబర్ 6 వరకు, సీనియర్ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ డిసెంబర్ 14 నుంచి జనవరి 8 వరకు జరగనున్నాయి. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌లకు ముంబై, కోల్‌కతా, మొహాలీతోపాటు వైజాగ్ కూడా ఆతిథ్యమివ్వనుంది. అలాగే, వైజాగ్ విజయ్ హజారే ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లకు కూడా వేదిక కానుంది. మహిళల క్రికెట్ సీనియర్ మహిళల టీ20 ట్రోఫీతో ప్రారంభంకానుంది. అక్టోబర్ 26 నుంచి నవంబర్ 20 వరకు జరగనుంది. ఆ తర్వాత సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ టీ20 ట్రోఫీ, వన్డే ట్రోఫీ, ఇంటర్‌జోనల్ వన్డే ట్రోఫీ, ఇంటర్‌జోనల్ మల్టీ డే ట్రోఫీ జరుగుతాయి. ఈ సీజన్‌లో బీసీసీఐ కొన్ని మార్పులు చేసింది. పురుషుల అండర్-23 స్టేట్ 'ఏ' ట్రోఫీ, మహిళల విజ్జీ ట్రోఫీని వన్డేల నుంచి టీ20లకు మార్చింది. ఆధునిక క్రికెట్‌ను దృష్టి పెట్టుకుని బోర్డు ఈ మార్పు చేసింది. అలాగే, కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ విన్నర్, రెస్ట్ ఆఫ్ ఇండియా మ్యాచ్‌ను పునరుద్ధరించింది. అక్టోబర్ 1 నుంచి 4 వరకు ఈ మ్యాచ్ జరగనుంది. అలాగే, విజయ్ మర్చంట్ ట్రోఫీ(అండర్-16)ను షెడ్యూల్‌లో ముందుకు జరిపింది. నవంబర్ 14 నుంచి జనవరి 5 వరకు ఈ టోర్నీ జరగనుంది. మెరుగైన షెడ్యూల్, ఆటగాళ్ల సన్నద్ధత కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు బోర్డు తెలిపింది.




# నా కెరీర్ క్లోజ్ చేయాలనుకున్నాడు



భారత మాజీ బ్యాడ్మింటన్ స్టార్ జ్వాలా గుత్తా తన కెరీర్‌పై సంచలన వ్యాఖ్యలు చేసింది. సరైన మద్దతు లభించి, వివాదాలకు దూరంగా ఉండుంటే తాను ప్రపంచ నంబర్ వన్ అయ్యేదాన్నని ఆమె అభిప్రాయపడింది. అప్పటి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) అధ్యక్షుడు వీకే వర్మ, ఇతర కోచ్‌లు తన కెరీర్‌ను దెబ్బతీయాలని చూశారని ఆమె తీవ్ర ఆరోపణలు చేసింది. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది. 2010 కామన్వెల్త్ గేమ్స్‌లో జరిగిన ఓ ఘటనను ఆమె గుర్తుచేసుకుంది. ఆ టోర్నీలో తాను, అశ్విని పొన్నప్ప డబుల్స్ స్వర్ణం గెలిచిన తర్వాత సైనా నెహ్వాల్ సింగిల్స్‌లో స్వర్ణం సాధించిందని తెలిపింది. "మేం స్వర్ణం గెలిచినప్పుడు వీకే వర్మ పట్టించుకోలేదు. కానీ, రెండు గంటల తర్వాత సైనా గెలవగానే అతడు కోర్టులోకి పరుగెత్తుకెళ్లి సంబరాలు చేసుకున్నాడు. మా స్వర్ణం తక్కువేమీ కాదు కదా? అని ఆనాడే ప్రశ్నించాను" అని జ్వాలా వివరించింది. వీకే వర్మ తన కెరీర్‌ను ముగించేందుకు తీవ్రంగా ప్రయత్నించాడని జ్వాలా ఆరోపించింది. "2006లో ఎలాంటి కారణం చెప్పకుండా నన్ను జట్టు నుంచి తొలగించారు. మళ్లీ రియో ఒలింపిక్స్ తర్వాత కూడా అదే పునరావృతమైంది. ఆ తర్వాత పోరాడి ప్రయోజనం ఏముందనిపించింది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఏ క్రీడాకారుడూ వివాదాలు కోరుకోడని, కానీ తన హక్కుల కోసం పోరాడాల్సి వచ్చిందని ఆమె పేర్కొంది. ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రా దీనికి సరైన ఉదాహరణ అని, ఒక ప్రపంచ ఛాంపియన్‌ను తయారు చేయడానికి ఎంత వ్యక్తిగత శ్రద్ధ, పెట్టుబడి అవసరమో అతన్ని చూస్తే తెలుస్తుందని జ్వాల వెల్లడించింది. "ఎలాంటి ఆర్థిక మద్దతు, స్పాన్సర్‌షిప్ లేకుండానే నేను వరల్డ్ నంబర్ 5కి చేరుకున్నాను. అదే మద్దతు ఉండి ఉంటే నంబర్ వన్ అయ్యేదాన్ని" అని జ్వాలా తెలిపింది. క్రీడా వ్యవస్థలో మార్పు రావాలని, నేటి క్రీడారంగంలో రాజకీయ పలుకుబడి ఉన్నవారి మాటే నెగ్గుతోందని ఆమె వ్యాఖ్యానించింది.

# వరల్డ్ కప్‌లో రోహిత్ ఆడేది డౌటే!


రోహిత్ శర్మ భవిష్యత్ గురించి బీసీసీఐ వర్గాలు మాట్లాడుతూ.. "బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు గత మూడు వారాల్లో రోహిత్ ఎప్పుడూ రిపోర్టు చేయలేదు. అతడు బాగా సన్నబడ్డాడు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అతడి శరీరం యాభై ఓవర్ల ఫార్మాట్‌కు సిద్ధంగా ఉందా? లేదా? అన్న అంశంపై ఆందోళన నెలకొంది. జట్టులో ఉంటే అతడు యాభై ఓవర్ల పాటు ఫీల్డింగ్ చేయాల్సి ఉంటుంది. ఐపీఎల్ మాదిరి వన్డే క్రికెట్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ ఆప్షన్ లేదు కదా!.. నలభై ఏళ్ల వయసుకు దగ్గరపడుతున్న తరుణంలో రోహిత్ శరీరం ఎలా స్పందిస్తుందన్నది ముఖ్యం. నిజానికి వరల్డ్‌కప్ టోర్నీకి ముందు ఆడే వన్డేల సంఖ్య కూడా తక్కువగానే ఉంది. కాబట్టి రోహిత్‌కు ప్రత్యామ్నాయంగా బ్యాకప్ ఓపెనర్‌గా యశస్వి జైస్వాల్‌ను సిద్ధం చేయాల్సి ఉంది. ఇషాన్ కిషన్ ఇప్పటికే వన్డే జట్టులోకి వచ్చాడు. అతడు కూడా ఓపెనింగ్ చేయగలడు. వన్డే వరల్డ్‌కప్ జట్టులో రోహిత్ ఫిట్‌నెస్ కారణాల దృష్ట్యా చోటు దక్కించుకోలేకపోయినా.. శుబ్‌మన్ గిల్ లేదంటే యశస్వి జైస్వాల్ గాయపడినా మరో బ్యాకప్ ఓపెనర్‌ను కూడా సిద్ధం చేసుకుంటే బాగుంటుంది" అని తెలిపినట్లు సదరు కథనం పేర్కొంది. కాగా చాలా ఏళ్లుగా.. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ- ప్రస్తుత సారథి శుబ్‌మన్ గిల్ భారత వన్డే జట్టు ఓపెనింగ్ జోడీగా



కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ గురించి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ఇటీవల స్పందించే క్రమంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ కంటే ముందు ఓపెనర్‌గా యశస్వి జైస్వాల్‌కే తాము ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశాడు.

## ఆ బౌలర్లు నన్ను భయపెట్టారు: కోహ్లీ

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సచిన్ టెండూల్కర్ తరహాలోనే భారత జట్టును ఏలాడు. వేలాది పరుగులు చేసి చరిత్ర సృష్టించాడు. అప్పట్లో క్రికెట్ దేవుడు సచిన్ అయితే... ఇప్పుడు విరాట్ కోహ్లీ అన్న రేంజ్ లో పరిస్థితి నెలకొంది. అలాంటి విరాట్ కోహ్లీని కూడా ముగ్గురు బౌలర్లు భయపెట్టించారట. వాళ్లను ఆడడం ఇప్పటికీ కూడా ఇబ్బందిగా ఉంటుందని స్వయంగా విరాట్ కోహ్లీ పేర్కొన్నట్లు ఓ పోస్టు వైరల్ గా మారింది. టెస్టుల్లో జేమ్స్ అండర్సన్ ను ఎదుర్కోవడం చాలా ఇబ్బందిగా ఉంటుందని విరాట్ కోహ్లీ పేర్కొన్నట్లు తెలుస్తోంది. 2014 ఇంగ్లాండ్ పర్యటనలో కూడా అతడి బౌలింగ్ లో విరాట్ కోహ్లీ చాలా ఇబ్బంది పడి ఔట్ అయ్యాడు. ఇక వన్డే ఫార్మాట్ లో ఇంగ్లాండ్ బౌలర్ అదిల్ రషీద్ ను ఎదుర్కోవడం సవాల్ గా ఉంటుందని వివరించాడట. ఇప్పటి వరకు విరాట్ కోహ్లీని ఐదుసార్లు డిస్మిస్ చేసిన స్పిన్నర్ గా అదిల్ రషీద్ కు రికార్డు కూడా ఉంది. అటు మలింగా బౌలింగ్ ను తొలినాళ్లలో ఎదుర్కోవడం సవాల్ గా మారిందట. కానీ ఆ తర్వాత అలవాటైపోయిందని విరాట్ కోహ్లీ పేర్కొన్నట్లు తెలుస్తోంది. టీ20 క్రికెట్ లో సునీల్ నరైన్ ను ఎదుర్కోవడం చాలా ఇబ్బందిగా ఉంటుందని విరాట్ కోహ్లీ ఒప్పుకున్నాడట.



నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# కాక్రోచ్ జనతా పార్టీకి జేజేలు

ప్రస్తుత దేశ రాజకీయాల్లో అణుబాంబు పేలినా బతికి బట్టకట్టే జీవులు ఏవైనా ఉన్నాయా అంటే... అవి నాయకులు మాత్రమే అని ప్రజలకు ఎప్పుడో అర్థమైపోయింది. అవినీతి ఆరోపణలు, కుంభకోణాలు, పార్టీ ఫిరాయింపులు లాంటి ఎంత పెద్ద రేడియేషన్ ముప్పు వచ్చినా సరే, ఏమాత్రం చెక్కుచెదరకుండా మనుగడ సాగించడంలో మన దేశంలోని ప్రధాన పార్టీల నాయకులు ఆరితేరిపోయారు. సరిగ్గా ఈ 'సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్' సిద్ధాంతాన్ని స్ఫూర్తిగా తీసుకుని పుట్టుకొచ్చిందే కాక్రోచ్ జనతా పార్టీ. ఇప్పుడు దేశవ్యాప్తంగా సామాన్యుల నుంచి సోషల్ మీడియా దాకా అందరి నోటా నానుతున్న పేరు ఇదే! ప్రధాన పార్టీల నిర్వాకాలపై విసిగిపోయిన జనం, తమ అసంతృప్తిని ఈ బొద్దింకల పార్టీ ద్వారా తీర్చుకుంటున్న తీరు వర్తమాన రాజకీయాలకు పట్టిన అతిపెద్ద సెటైర్. అడవికి రాజు సింహం కావచ్చు, కానీ రాజకీయమనే మురుగు కాల్వలో రాజు మాత్రం బొద్దింకే! ప్రధాన పార్టీలన్నీ పులులు, సింహాలు, ఏనుగులు అంటూ గొప్ప గొప్ప జంతువులతో తమను తాము పోల్చుకుంటూ ఉంటే, కాక్రోచ్ జనతా పార్టీ మాత్రం అత్యంత వాస్తవికతతో గ్రౌండ్ లెవల్‌లో ఆలోచించింది. బొద్దింకలు ఎప్పుడూ వెలుతురులో తిరగవు. చీకటి పడగానే వంటింట్లోకి చొరబడి అంతా ఊడ్చేస్తాయి. మన నాయకులు కూడా అంతే కదా! ఆర్టీఐ అన్నా, మీడియా ఫోకస్ అన్నా ఆమడ దూరం పరిగెత్తుతారు. తెర వెనుక చీకటి ఒప్పందాలు చేసుకోవడంలో వారు బొద్దింకలకే గురువులు. ఒక్క రాత్రిలో వేలకొద్దీ సంతానాన్ని ఉత్పత్తి చేయగల అద్భుతమైన శక్తి బొద్దింకల సొంతం. అలాగే, ఎన్నికలు రాగానే ఒక్కసారిగా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే హామీలు, పథకాలు కూడా ఈ కోవలోకే వస్తాయి. ప్రధాన పార్టీలు చేసే మోసపూరిత వాగ్దానాల కంటే, ఈ కాక్రోచ్ పార్టీ మేనిఫెస్టో ఎంతో నిజాయితీగా ఉందని ప్రజలు భావిస్తున్నారు. ఆ మేనిఫెస్టోలోని ముఖ్యాంశాలు చూస్తే ఎవరికైనా నవ్వు, కన్నీరు ఒకేసారి వస్తాయి. 'మేము దాపరికాలు లేకుండా తింటాం. మీ పన్నుల రూపంలో వచ్చే ప్రతి రూపాయినీ పారదర్శకంగా జేబులో వేసుకుంటాం. మీరు కూడా ధైర్యంగా లంచాలు ఇచ్చుకునే స్వేచ్ఛను ప్రసాదిస్తాం. కొత్త అబద్ధాలు ఆలోచించే సమయం మాకు లేదు. కాబట్టి 1947 నుంచి ప్రధాన పార్టీలు చెబుతున్న పాత హామీలనే మేమూ కాపీ కొడతాం. మేము నివసించేది అందులోనే కాబట్టి, మా ఇళ్లను (మురుగు కాల్వలను) స్మార్ట్ సిటీలుగా మారుస్తాం. అవసరమైతే దేశాన్ని కూడా ఒక పెద్ద డ్రైనేజీలా తీర్చిదిద్దుతాం. ఒకప్పుడు ఊసరవెల్లులకు మాత్రమే ఉండే ఈ అర్హతను ఇప్పుడు మా నాయకులకు బదిలీ చేశాం. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కండువా రంగు మార్చే ప్రాథమిక హక్కును మా ఎమ్మెల్యేలకు అందిస్తాం' అంటూ సెటైరికల్‌గా హామీల చిట్టాను విప్పింది. నిన్నటిదాకా కులాల పేరుతోనో, మతాల పేరుతోనో, ఉచితాల పేరుతోనో ప్రజలను మభ్యపెట్టొచ్చు అనుకున్న జాతీయ, ప్రాంతీయ పార్టీలకు ఈ 'కాక్రోచ్ జనతా పార్టీ' ట్రెండ్ పెద్ద షాక్ ఇస్తోంది. సోషల్ మీడియాలో యువత తమ ప్రొఫైల్ పిక్చర్లుగా బొద్దింకలను పెట్టుకోవడం, నాయకుల ఉపన్యాసాల కింద కాక్రోచ్ ఎమోజీలు కామెంట్లుగా పెడుతుండటం చూసి పెద్ద తలకాయలకు చెమటలు పడుతున్నాయి. 'మీరు చేసే అభివృద్ధి కంటే మా ఇంట్లో తిరిగే బొద్దింక నయం, కనీసం అది అబద్ధాలు చెప్పదు' అంటూ సామాన్యులు విసురుతున్న సెటైర్లు పాలకుల చెవికి చేరాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజలు కసిగా ఓటేయడానికి కూడా ఇష్టపడకుండా, ఇలా సెటైరికల్ ట్రెండ్స్ వెనుక దాక్కుంటున్నారంటే.. ప్రజాస్వామ్యం పట్ల, ఎన్నికల వ్యవస్థ పట్ల వారికి ఎంతటి నిర్లిప్తత ఆవరించిందో అర్థం చేసుకోవచ్చు. కాక్రోచ్ జనతా పార్టీ అనేది ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీ కాకపోవచ్చు. కానీ, అది వందలాది రాజకీయ పార్టీల నిజస్వరూపానికి అద్దం పడుతున్న ఒక బలీయమైన సామాజిక ఆయుధం. ప్రజలు ఒక సింహాన్ని కాదని, ఒక బొద్దింకను నెత్తిన పెట్టుకుంటున్నారంటే.. వ్యవస్థ ఎంతగా భ్రష్టుపట్టిందో రాజకీయ పార్టీలు ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలి. అలా కాని పక్షంలో, భవిష్యత్తులో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలను కూడా ఈ రాజకీయ బొద్దింకలే అధికారికంగా ఆక్రమించుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు!



## బతుకు చిత్రాలు

వీధి చివర
ముసలి పాక గుండె కోత!
ఆకలి పాట ఆఖరి చరణం

గుడిసెను మోస్తున్న
మట్టి గోడ హరాత్మరణం!
పేదరికపు చివరి మజిలీ

ఇంటి బయట
వినిపించే హీన స్వరం!
భిక్షా పాత్ర కడుపు కేక

గుడిమెట్లపై
జాగా ధారులు!
చిల్లర గిన్నెలపై
చిరిగిన నోట్లు

రోడ్డుపక్క
రాత్రి వారసులు!
కూడూ గూడూ లేని
బ్రతికున్న శవాలు

అవని సంచారకులు
అనాధ జీవులు
చెత్త కుండీలో
చిత్తు కాగితాలు.

వీరెవరు?

చీకటి ప్రసవించిన
దేహాలు...
కన్నీళ్లు వెలిగించిన
దీపాలు...
కాలం కరుణించని
బతుకు చిత్రాలు



ఏ నాగాంజనేయులు
తెలుగు ఉపాధ్యాయుడు-
కర్నూలు, 9959017179

# కాలాన్ని మరువని 'తిరుగులేని ప్రయాణం'

విస్మృత కథకుడు నల్లాల లక్ష్మిరాజం జగిత్యాల జిల్లాలోని తక్కెళ్లపల్లిలో రాజవ్వ, రాజయ్య దంపతులకు 05-10-1970న జన్మించారు. వీరిది మాల కులం. కష్టపడి చదువుకొని కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించారు. ప్రచారాన్ని కోరుకోని వ్యక్తిత్వం ఆయనది. తన పనిలో నిమగ్నమై ఉండే స్వభావం కలవారు. వీరి కథలు 'మూడుతరాల తెలంగాణ కథ', 'తెలంగాణ దళిత కథలు' వంటి సంకలనాల్లో లేకపోవడంతో విస్మృత కథకుడిగా చెప్పుకోవచ్చు. కేవలం ఎనిమిది కథలతోనే తన కాలాన్ని నిక్షిప్తం చేశారు. ఆయన కథా సంపుటి పేరు 'తిరుగులేని ప్రయాణం'.




డాక్టర్ సిద్దెంకి
9441244773

తొంభై దశకంలోని కల్లోల పరిస్థితులను లక్ష్మిరాజం తన కథల్లో ప్రతిబింబించారు. పోలీసు ఉద్యోగం చేయడం వల్ల పోలీసు దృక్పథం, పోలీసు నేపథ్యం ఆయన కథల్లో కనిపిస్తాయి. దొరల పెత్తనాలు, అణిచివేతలు, అక్రమాలు కథల్లో దర్శనమిస్తాయి. నక్సల్బరీ ఉద్యమానంతరం గ్రామాలను శాసించే దొరలలో ఏర్పడిన భయం, దొరలంటే భయపడే ప్రజల్లో కలిగిన ఆందోళనను చిత్రించిన కథ 'తిరుగులేని ప్రయాణం'. భయం వల్ల ఇరువురి జీవితాలు ఎలా అతలాకుతలమయ్యాయో ఈ కథ తెలియజేస్తుంది. దొర తన జీతగాడైన రాజేష్‌ను కొట్టడంతో, "అన్నలకు చెబుతాను" అని బెదిరిస్తూ రాజేష్ వెళ్లిపోతాడు. అదే రోజు పక్క ఊరి దొర రాజగోపాల్‌రావును అన్నలు చంపడంతో, "నన్నేమి చేస్తారో" అనే భయంతో దొర రాత్రికి రాత్రే పట్టణానికి పారిపోతాడు. హైదరాబాద్ వెళ్తూ దాహంతో రోడ్డు పక్కన ఉన్న నీటి గుంటల వద్దకు వెళ్తాడు. అక్కడ రాజేష్ కనిపిస్తాడు. ఇద్దరూ నీళ్లు తాగి పరస్పరం మాట్లాడుకుంటారు. "ఆ రోజు నేను అన్నలకు చెప్పలేదు. ఊరికి ఉత్తరం రాస్తే మీరు వస్తారనే భయం పట్టుకుంది. అయినా ఊరు మీద ప్రేమ గుంజుతోంది. వెళ్లాలని ఉంది" అని రాజేష్ చెబుతాడు. "ఈ పట్టణంలో మనుషులు యంత్రాల్లా ఉన్నారు. నాకు కూడా ఊరికి వెళ్లాలని ఉంది" అని దొర అంటాడు.

బతుకమ్మ పండుగ రోజు ఇద్దరూ కలిసి ఊరికి బయలుదేరుతారు. "నేను ఊరిలో ఉండను. మీరు ఉంటే మంచిది" అని రాజేష్ దొరకు చెబుతాడు. ఊరికి దగ్గరలో రాజేష్ అమ్మమ్మ చెల్లెలు కలుస్తుంది. "దొరను ఊరినుంచి వెళ్లగొట్టిన రాంరెడ్డి పటేల్‌ను రాత్రి ఎవరో చంపారట. ఊరిలో ఇప్పుడు దొరలు ఎవరూ లేరు. కొందరు బొంబాయికి పారిపోయారు" అని చెబుతుంది. "నువ్వు ఊరికి వెళ్తే పోలీసులు పట్టుకుపోతారు. ఈ రాంరెడ్డి పటేలే మరో దొరయ్యాడు. అతడూ అక్రమాలే చేశాడు. అందుకే అన్నలు చంపారు. ఊరు ఇంకా ఉద్రిక్తంగానే ఉంది. ఎక్కడైనా మంచిగా బతుకు బిడ్డా!" అని ముసలమ్మ అంటుంది. దీంతో రాజేష్, దొర వెనక్కి తిరుగు ప్రయాణమవుతారు. విప్లవోద్యమం వల్ల గ్రామాల్లో దొరల ఆధిపత్యం క్షీణించింది. పీడితులకు ధైర్యం వచ్చి, పీడకుల్లో భయం పెరిగింది. హత్యలు, అస్థిరతల కారణంగా ప్రజలు పట్టణాలకు వలస వెళ్లారు. దొర, రాజేష్ మధ్య మానవత్వం పెరిగినా భయం మాత్రం కొనసాగుతూనే ఉంది. ఈ కథ ఆ కాలపు అనిశ్చితిని, సామాజిక మార్పులను ప్రతిబింబిస్తుంది. చదువుకు ఎదురైన ఆటంకాలను అధిగమించి కొడుకును చదివించిన తల్లి జీవితం ఆధారంగా రాసిన కథ 'రాజవ్వ కొడుకు'. పటేళ్లు దేవయ్యను వెటకారంగా చూస్తారు. జెండా వందనం రోజున బహుమతి ఇవ్వడానికి తటపటాయిస్తే చేతిలోంచి గుంజుకుంటాడు. ఒక్కటికి నాలుగు చెప్పి తండ్రితో కొట్టిస్తారు. దేవయ్యను, అతని తల్లిని రాజనర్సు కొడతాడు. అయితే దేవయ్యను మెచ్చుకున్న ఉపాధ్యాయుడు, "దొరలకు పాలేర్లు దొరకరనే భయం ఉండొచ్చు. ఇలాంటి ఆటుపోట్లను ఎదుర్కోక తప్పదు. దేవయ్య మంచివాడు" అని అంటాడు. రాజవ్వ భర్తను ఒప్పించి దేవయ్యను జగిత్యాల హాస్టల్లో చేర్పిస్తుంది. రాత్రిళ్లు పనులు చేస్తూ చదువుకున్న దేవయ్య ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణుడవుతాడు. తర్వాత న్యాయవాదిగా ఎదిగి, రిజర్వు కేటగిరీలో సర్పంచ్ అవుతాడు. జెండా వందనం రోజున అనర్గళంగా ప్రసంగిస్తాడు. సమావేశం ముగిసిన తర్వాత రాజనర్సు వెళ్తూ రాజేశ్వరరావు కూర్చునే గద్దెవైపు ఉమ్మి వేస్తూ వెళ్లడం ప్రతీకాత్మకంగా నిలుస్తుంది.

కులం ఎలా శిక్షిస్తుందో, మనుషులను ఎలా నాశనం చేస్తుందో తెలిపే కథ 'దొమ్మరి గంగడు'. దొమ్మరులను వేశ్యావృత్తి, జిమ్నాస్టిక్స్, దొంగతనాలతో ముడిపెట్టిన సమాజం నుంచి బయటపడాలని గంగడు రైస్‌మిల్లులో పనిచేస్తాడు. కానీ యజమాని అతనిపై దొంగతనం నేరం మోపి పోలీసులకు అప్పగిస్తాడు. పోలీసులు అతన్ని పెద్ద దొంగగా రికార్డుల్లో నమోదు చేస్తారు. గంగడు పెద్దకూతురు సరోజ వ్యభిచార వృత్తిలో కొనసాగుతూ హెచ్ఐవీ బారినపడి చనిపోతుంది. చిన్న కొడుకు గోపిని బడిలో అవమానిస్తారు. "నీ అక్క దగ్గరికి వస్తున్నారా?" అని తోటి విద్యార్థి అడగడంతో గొడవ జరిగి చదువు మానేస్తాడు. చిన్న కూతురు వ్యభిచార వృత్తి చేయనని లారీ డ్రైవర్‌తో పారిపోతుంది. "నాతో దొంగతనానికి రాకపోతే నీ అమ్మను చంపి నేనూ చస్తాను" అని గంగడు బెదిరించడంతో గోపి దొంగతనానికి వెళ్తాడు. చివరికి దొంగతనం చేసిన డబ్బును గోపి చేతిలో పెట్టి "ఈ డబ్బుతో దూరంగా వెళ్లి బతుకు" అని చెప్పి గంగడు ఆత్మహత్య చేసుకుంటాడు. తర్వాత గోపి దొమ్మరి కాలనీలో పాఠశాల స్థాపించి ఉపాధ్యాయుడిగా మారడం ఆశాజనక ముగింపుగా నిలుస్తుంది. 'మా ఊరి ముచ్చట్లు' కథ అక్రమ సంబంధాల పర్యవసానాలను చూపిస్తుంది. శాంతమ్మ, చుక్కారెడ్డి అక్రమ సంబంధంలో పట్టుబడినా, శాంతమ్మ భర్త నర్సయ్య "నా పెండ్లాం నా ఇష్టం. మీకేం పని?" అని ప్రశ్నిస్తాడు. తర్వాత శాంతమ్మను రిజర్వేషన్ కేటగిరీలో సర్పంచ్ చేస్తారు. కానీ అధికారమంతా చుక్కారెడ్డి చేతుల్లోనే ఉంటుంది. మరోవైపు చుక్కారెడ్డి భార్య మంగమ్మ జీతగాడు బుచ్చన్నతో సంబంధం పెట్టుకుంటుంది. చివరికి చుక్కారెడ్డి కూతురు రజిత, శాంతమ్మ కొడుకు శంకర్ ప్రేమించి పెళ్లి చేసుకోవడం కథలో వ్యంగ్యాత్మక మలుపుగా నిలుస్తుంది.

'పునరావృతం' కథలో అత్తింటి హింసను భరించలేక ఇంటికి వచ్చిన చెల్లెలు కోసం అన్న చేసిన త్యాగాన్ని చూపించారు. కట్నం కోసం జాగ అమ్మి చెల్లెలి సంసారం నిలబెట్టాడు. ఇరవై ఏళ్ల తర్వాత తన కొడుకు పెళ్లి విషయంలో అదే పరిస్థితి ఎదురవుతుంది. అప్పట్లో తాను చేసిన త్యాగమే ఇప్పుడు తన మీద పునరావృతమవుతుందని గ్రహించి ఆలోచనలో పడతాడు. 'పడగనీడలో పావురాలు' కథలో విధి నిర్వహణలో నిబద్ధత కలిగిన కానిస్టేబుల్ ప్రకాశ్ జీవితం చిత్రితమవుతుంది. బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంలో జరిగిన కాల్పుల్లో అమాయకులు బలవుతారు. ప్రజలతో మమేకమై పనిచేసిన ప్రకాశ్ చివరకు మందుపాతర పేలుడులో మృతి చెందడం కథలో విషాదాన్ని మరింత గాఢం చేస్తుంది. లక్ష్మిరాజం కథల్లో జగిత్యాల ప్రాంతీయ భాష సమృద్ధిగా కనిపిస్తుంది. "మిరిగుడ్లు", "పుండాకోరాడా", "కుదపెట్టుడు", "ఇడ్సిపెట్టం", "దెంకపోయిండు" వంటి పలుకుబడులను ఆయన కథల్లో సహజంగా వినిపిస్తాయి. "శీలం కంటే కులం గొప్పదేమో!" వంటి వ్యంగ్య వాక్యాలతో సమాజంలోని కులవివక్షను ఎండగట్టారు. సమాజాన్ని చితికించిన వాస్తవాలను కళాత్మకంగా ఆవిష్కరించిన కథాసంపుటే 'తిరుగులేని ప్రయాణం'. తెలుగు సాహిత్యం స్మరించదగిన కథలను అందించిన నల్లాల లక్ష్మిరాజంకు నిజంగానే పోలీస్ సెల్యూట్‌లు.




This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.